



www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
12-07-2024

సంపుటి : 01 । సంచిక : 69 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS






నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యా బోధన

అపోలో మెడికల్ అకాడమీలో చేరితే దాదాపు డాక్టర్ పట్టా గ్యారెంటీ

# బంగారు భవితకు అత్యుత్తమ బోధన

**విశ్వంభర, చైతన్యపురి :** ప్రతి సంవత్సరము దాదాపు 600 నుంచి 1000 మంది విద్యార్థులు చేరితే 70 శాతం వరకు విద్యార్థులు డాక్టర్ పట్టాను పొందు తున్నన్నారు. ఎయిమ్స్, జిప్మర్, నీట్ లాంటి ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు రాబట్ట డంతో ఒకసారిగా అపోలో మెడికల్ అకాడ మీ రాష్ట్రస్థాయిలో బాగా పేరుగాంచింది. గ్రా మీణ ప్రాంత విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా విద్యను అందించడంతో వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దాని కి తోడు పేద విద్యార్థులకు 15 శాతం రాయితీతో విద్యను అందించడంతో అకాడమీలో కోచింగ్ తీసుకునేందుకు ఆసక్తికరపరు-స్తున్నారు. విద్యార్థిని, విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ క్యాంపస్‌లు ఉండడంతో చాలామం ది స్వేచ్ఛగా చదువుపై దృష్టి సారిస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్‌లో అత్యధిక విద్యార్థులు సీట్స్ సాధించడం ఈ అకాడమీ ప్రత్యకతను చాటుతుంది. ఢిల్లీ, రిషికేష్, అమరావతి, బీబీనగర్ లాంటి హాస్పిటల్ ల కూడా విద్యార్థులు చేరారు. అత్యుత్తమ అధ్యా పకుల బోధన వల్లనే మంచి ఫలితాలు రావడం, తరగతి గదిలో అధ్యాపకులు బోధిం చే విషయాలు పూర్తిగా విద్యార్థులకు అవ గాహన వచ్చేలా శిక్ష ణ ఇవ్వడం అకాడమీ ప్రత్యే కత. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారి సందేహా లను నివృత్తి చేస్తారు. తక్కువ ఖర్చుతోనే అత్యుత్తమ విద్యను అందజేస్తున్నారు.





> డాక్టర్ వృత్తి అంటేనే ఎంతో పవిత్రమైనది. ఆ పవిత్రమైన పుణ్యకా ర్యానికి తనవంతుగా ఏదో చేయాలని తపన తో పోసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి 2019లో చైతన్య పురిలో అపోలో మెడికల్ అకాడమీ స్థాపించా రు. ఈ ఆరేండ్లలో ఎంతోమంది డాక్టర్లను త యారు చేశారు. స్థాపించిన అనతి కాలంలో నే విద్యార్థులను డాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను చేపట్టారు. ప్రతి విద్యార్థి పట్ల చదువుపై శ్రద్ధ కనపరుచుతుండడంతో అత్యుత్తమ ఫలితాలు రాబడుతున్నామన్నారు.

### ఒకేసారి 338 మంది విద్యార్థులకు ర్యాంకులు

అకాడమీ నుంచి 2024లో దాదాపు 480 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 338 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. 720 మార్కులకు గాను నవీన్ చౌదరి 715 మార్కులు, మౌనిక, సాయి కీర్తనలకు 712, రిషిక 705, శ్వేత 700 మార్కులు సాధించినట్లు తెలిపారు. 650 మార్కులు 22 మందికి, 600 మార్కులు 38 మందికి, 550 మార్కులు 45 మందికి, 500 మార్కులు 156 మందికి, 450 మార్కులు 90 మందికి వచ్చినట్లు తెలిపారు. దాదాపు 28 మందికి ఎయిమ్స్‌లో సీట్లు సాధించినట్లు తెలిపారు. తమ అకాడమీ నుంచి పరీక్షకు హాజరైన ప్రతి ముగ్గురిలో ఇద్దరు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో బోధించడం వల్లనే అత్యుత్తమ ఫలితాలు రాబట్టగలిగామన్నారు.

### నాణ్యమైన విద్యను అందించడంలో రాజీపడం



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రాజీపడే ప్రసక్తే లేదు. నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన ఆహారం ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధనను అందజేస్తున్నాం. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ర్యాంకు సాధించడం కోసం తీర్చిదిద్దేందుకు అపోలో మెడికల్ అకాడమీ ఎంతో కృషి చేస్తుంది. ప్రతి సంవత్సరం మే, జూన్ మాసాలలో తమ అకాడమీలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. పేద విద్యార్థులకు 15 శాతం రాయితీ ఇస్తున్నాం. 2024 సంవత్సరంలో నీటిలో 720 మార్కులకు గాను 715 మార్కులు వచ్చాయి. అకాడమీని అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రొఫెసర్ కోదండరాం సార్ సూచనలు తీసుకుంటున్నాం. అకాడమీకి ప్రొఫెసర్ కోదండరాం సార్ వచ్చి విద్యార్థినీ, విద్యార్థులకు ర్యాంకులు సాధించడంతోపాటు కష్టపడే తత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై వారి అమూల్యమైన సందేశాన్ని అందజేశారు. సమాజ సేవ కోసం ప్రధాన రహదారులపై బార్కెడ్లు ఏర్పాటు చేసి ప్రమాద నివారణకు తమ వంతు కృషి చేస్తున్నాం. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రధాన రహదారులపై పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెద్ద కుండీలు ఏర్పాటు చేసి చెట్లని సంరక్షిస్తున్నాం.

– అకాడమీ చైర్మన్ పోసిరెడ్డి శ్రీనివాసరెడ్డి





# తిరుమల తరహాలో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి స్వయంభువు దర్శనం

**విశ్వంభర, యాదాద్రి :** తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి భక్తులకు మరో గుడ్ న్యూస్. తిరుమల దేవస్థానం తరహాలో భక్తులకు యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి స్వయంభువుల దర్శనం కలగనుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో తిరుపతి తర్వాత.. అత్యధిక సంఖ్యలో యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని భక్తులు దర్శించుకుంటున్నారు. యాదాద్రి ఆలయ పునర్ నిర్మాణం తర్వాత యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి భక్తుల రద్దీ విపరీతంగా పెరుగుతుంది. ప్రతి రోజూ వేల సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటున్నారు. ఇప్పటి వరకు ప్రధానాలయంలోకి చేరుకున్న భక్తులు గర్భాలయం ముఖ ద్వారం నుంచి స్వయంభువులను దర్శించుకునేవారు. నేటి నుంచి ప్రయోగాత్మకంగా ప్రధాన ఆలయంలోకి వచ్చిన భక్తులు మహాముఖ మండపంలో దూరం నుంచే మూలవరులను చూస్తూ.. గర్భగుడి చెంతకు భక్తులు చేరేలా కాంప్లెక్స్‌ను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. తిరుమల తరహాలో లక్ష్మీనారసింహులను దర్శించుకునే ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. గర్భగుడిలోని నారసింహుడిని మహాముఖ మండపంలో 26 అడుగుల దూరంలో ఉన్న వేదికపై నుంచి భక్తులు దర్శించు కోవచ్చని ఆలయ ఈవో భాస్కర్ రావు చెప్పారు. రూ.150 శీఘ్ర, ధర్మ దర్శన మార్గాలు గర్భగుడి వద్దకు చేరుకునే విధానంలో మా ర్పు తెచ్చి ఆ వరుసల్లోని భక్తులను కొత్తగా ఏర్పాటైన వేదిక పై నుంచి పంపిస్తారని తెలిపారు. ఇక ఆలయానికి వచ్చే దివ్యాం గులకు పశ్చిమ గోపురం నుంచి నేరుగా యాదాద్రీశుడి దైవదర్శ నం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అలాగే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సూచన మేరకు యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి తీర్థంతో పాటు శఠారి ఆశీర్వాదం ఇవ్వనున్నారు. ఈనెల 14వ తేదీన వనమహోత్సవం పేరిట యాదాద్రి క్షేత్ర పరిధిలో రెండు వేల మొక్కలు నాటేందుకు దేవస్థానం తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 15న ఉదయం 6.05 నిమిషాలకు సామూహిక 'గిరి ప్రదక్షిణ' నిర్వహిస్తున్నామని ఈవో వివరించారు. యాదాద్రి ఆలయంలో కొత్త నిత్యాన్నప్రసాద భవనాన్ని శ్రావణమాసం తొలివారంలో ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.




# టైంకు జీతాలు రాక ఉద్యోగుల సిబిల్ స్కోర్ పడిపోతుంది

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**విశ్వంభర, హైదరాబాద్ :** టైంకు జీతాలు పడకపోవడంతో.. ఉద్యోగుల సిబిల్ స్కోర్ పడిపోతుందని ఫైర్ అయ్యారు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఊహించని షాక్ ఇచ్చింది. జులై మాసంలో 10వ తేదీ గడిచిన కూడా ఇప్పటివరకు.. జీతాలు పడలేదని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఉద్యోగులు మరియు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని సొసైటీలలో ముందుగానే వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ తమ సొసైటీలో మాత్రం ప్రతి నెల ఇదే పరిస్థితి ఉంటోందని వాళ్ళు ఆందోళన చెందుతున్నారు. ఇక దీనిపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోస్ట్ పెట్టారు. ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు వేస్తున్నామని వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చుడు కాదు రేవంత్ గారు, ప్రభుత్వ ఉద్యోగులకు టైంకు జీతాలు రాక సిబిల్ స్కోర్ తో ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహించారు. ఔట్ సోర్సింగ్/ కాంట్రాక్టు ఉద్యోగులకైతే గత 8 నెలలుగా జీతాలు ఇవ్వలేదు. నిరుద్యోగుల ఆవేదనను లెక్క చేయడం లేదు. చేతగాని నిరంకు శ కాంగ్రెస్ పాలనను ప్రజలే మట్టుబెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.




# రోడ్డు ప్రమాదంలో మిస్టర్ తెలంగాణ మృతి

**విశ్వంభర, సిద్దిపేట :** తెలంగాణలో విషాదం నెలకుంది. మిస్టర్ తెలంగాణ టైటిల్ విజేత, మోడల్, ప్రముఖ బాడీబిల్డర్ మహ్మద్ సోహైల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు విడిచాడు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న స్క్రాప్ ఆటోని ఢీకొంది. సోహైల్ అతని మిత్రుడు మహ్మద్ ఖదీర్‌తో కలిసి జూన్ 29న సిద్ది పేట నుంచి మిరిదొడ్డి వైపునకు వెళ్తుండగా ఈ యాక్సిడెంట్ జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయప డిన సోహైల్‌ను వెంటనే స్థానికంగా ఉన్న హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోహైల్ క న్నుమూశాడు. సోహైల్ స్వస్థలం సిద్ధిపేట. తెలం గాణలోని పేరున్న బాడీ బిల్డర్లలో అతడి పేరు ముం దు వరసలో ఉండేది. 23 ఏళ్ల వయస్సులోనే బాడీ బిల్డర్‌గా సోహైల్ పలు ఛాంపియన్ షిప్‌లు గెల్చుకున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొని విజేతగా నిలిచాడు. సోహైల్ చనిపోవడంతో.. సిద్ధిపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. పిన్న వయస్సులో సోహైల్ మరణాన్ని అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు జీ ర్ణించుకోలేకపోతున్నారు. బాడీబిల్డింగ్‌లో మంచి భవి ష్యత్తు ఉన్న తన ప్రియమైన స్నేహితుడిని కోల్పోయి నందుకు అతని స్నేహితుడు అఫ్రిది విచారం వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసుకున్న మిరుదొడ్డి పోలీసు లు అతివేగమే ప్రమాదానికి కారణమని తెలిపారు.





www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
12-07-2024
సంపుటి : 01 | సంచిక :69 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## నేడు కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే?

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ జంప్
- ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో హస్తం గూటిలోకి..
- ధ్రువీకరించిన ఎమ్మెల్యే అనుచరులు



6 లో..

## సీఎం సొంత జిల్లాలోనే మేఘ కృష్ణారెడ్డికి రూ.1100 కోట్ల కాంట్రాక్ట్

- చీకటి జీవోలతో సర్కారు నడిపిస్తున్న రేవంత్ రెడ్డి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

6 లో..

## రైతు బంధు తిరిగి చెల్లించండి..

- మేడ్చల్ రైతుకు ప్రభుత్వం ఆదేశం
- రూ.16 లక్షలు తిరిగి చెల్లించాలని నోటీసులు
- వెంచర్ భూమికి సర్కార్ సొమ్ము తీసుకున్నాడనే..

6 లో..



## రేవంత్ పనితీరుపై విచారణ ?

- పార్లమెంట్ స్థానాల ఓటమిపై సీరియస్
- 14 సీట్లు గెలుస్తామని ఎనిమిదితోనే సరి
- సీఎం సొంత నియోజకవర్గంలో బీజేపీ గెలుపు
- రేవంత్ కోరిన అభ్యర్థులు ఓటమి
- టీపీసీసీ చీఫ్‌గా, సీఎంగా ఓటమి బాధ్యత రేవంత్‌దే..?
- గాంధీభవన్‌లో విశ్లేషిస్తోన్న ఏఐసీసీ కమిటీ

# తెలంగాణపై ఏఐసీసీ ఫోకస్

విశ్వంభర, హైదరాబాద్ :

ఈమధ్యనే జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై పార్టీ పరంగా విశ్లేషించేందుకు ఏఐసీసీ కమిటీ హైదరాబాద్‌కు వచ్చింది. ముగ్గురు సభ్యుల కమిటీలో కురియన్, రఖిబుల్ హుస్సేన్, పర్గత్ సింగ్ ఉన్నారు. వీరిలో కురియన్, రఖీబుల్ హైదరాబాద్ చేరుకున్నారు. పర్గత్ నేడు హైదరాబాద్ చేరుకుంటారు. ఈమధ్యనే జరిగిన ఎన్నికల ఫలితాలను విశ్లేషించేందుకే కమిటీ వచ్చినట్లు చెబుతున్నా నిజానికి రేవంత్ రెడ్డి పనితీరుపైన విశ్లేషణ లేదా విచారణ అని అర్థమవుతోంది.

మిగతా 6 లో

## కేసీఆర్, కేటీఆర్ కాళ్లు మొక్కినా..

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆ పార్టీలో ఉండటం లేదు

- పదేళ్లుగా సొంత పార్టీనేతలను అవమానించిన చరిత్ర కేసీఆర్‌ది
- నిరుద్యోగుల రెచ్చగొడుతున్న మీరు.. తెలంగాణలోని ఏ యూనివర్సిటీలోన అడుగుపెట్టే దమ్ముందా..?
- మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఫైర్



2 లో..



## అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్

- ఈ నెల 24 నుంచి తెలంగాణ బడ్జెట్ సెషన్స్
- రైతు భరోసా విధివిధానాలపై చర్చకు చాన్స్
- అసెంబ్లీ వేదికగా జాబ్ క్యాలెండర్ ప్రకటన
- సమావేశాలకు కేసీఆర్ హాజరుపై ఉత్కంఠ

6 లో..



# ఉద్యమకారులకు సముచిత స్థానం ఎక్కడ ?

ప్రపంచంలో ఏ ఉద్యమమైనా ఉద్యమకారుల పాత్ర లేనిదే అది విజయం సాధించదు. ఉద్యమానికి ఊపిరి ఉద్యమకారులు. వారి ప్రాణాలను సైతం అడ్డుపెట్టి మరి లక్ష్యం కోసం పోరాడాడటమే ఉద్యమకారుల పాత్ర. ఇటలీ ఉద్యమంలో రెడ్ షర్ట్స్ కానీ, రష్యా ఉద్యమంలో కౌమింటన్ పాత్ర కానీ చాలా కీలకం. వీరందరూ ఉద్యమకారుల సమూహాలతో కూడిన వర్గాలు. వీరి పాత్ర ఉన్నందునే ఈరోజు ఈ గొప్ప ఉద్యమాలు చరిత్రలో నిలపడగలిగాయి. మన దేశంలో కూడా జరిగిన అనేక ఉద్యమాల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమం చాలా కీలకం.




ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న రాష్ట్రం తెలంగాణ. ఇంతటి మహా ఉద్యమానికి నాడు నేడు వెన్నుదన్నుగా నిల్చున్నది ఉద్యమకారులు మాత్రమే. నాయకులు మారుతున్నా ఉద్యమకారులకు మాత్రం ఇంకా సముచిత స్థానం కల్పించడం జరగలేదు.

**ఉద్యమకారుల పాత్ర, కేసీఆర్ వైఖరి:**

తెలంగాణ రాష్ట్రం కోసం 1969లో పోరాడింది ఉద్యమకారులే. 2009లో పోరాడింది కూడా ఉద్యమకారులే. మలి దశ ఉద్యమంలో ఉద్యమకారుల పాత్ర చాలా కీలకం. 2001లో టీఆర్ఎస్ స్థాపించనప్పట్టి నుంచి అనేక మంది నాయకులు వస్తూ, వెళ్తూ ఉన్నా ఉద్యమకారులు మాత్రం రాష్ట్ర సాధన కోసమే టీఆర్ఎస్ వైపు నిలపడి పనిచేశారు. అనేక మంది అమరులయ్యారు. శ్రీకాంతచారి, యాదిరెడ్డి, యాదయ్య ఇలా అనేక మంది ఉద్యమకారులు అమరులయ్యారు. రైల్ రోకో, వంటావార్పు, బందులు, ర్యాలీలు, నిరసనలు మొదలగు అనేక కార్యక్రమల్లో ఉద్యమకారులు ఉవ్వెత్తున పాల్గొన్నారు. ఈ మలి దశ ఉద్యమం తొలిదశలో రాజకీయ ఉద్యమం మరింత తీవ్రంగా మారి కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పీఠాలను కదిలించింది. 2014 ఎన్నికలో టీఆర్ఎస్ 63 స్థానాల్లో గెలవడంలో ఉద్యమకారుల పాత్ర చాలా కీలకం. నాడు పార్టీ దక్షిణ తెలంగాణలో, హైదరాబాద్ ప్రాంతాల్లో అంతగా ప్రభావం లేనప్పటికీ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగిందంటే గ్రామాల్లో ఉద్యమకారులు పార్టీ వైపు నిలపడి వేయించిన ఓట్లే కీలకం.

**ఉద్యమకారులను పక్కకు పెట్టిన కేసీఆర్**

2014 తర్వాత తెలంగాణ రాజకీయం కొత్త మలుపు తీసుకుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆనాడు ఉద్యమంలో లేని వారు సైతం సొంత రాష్ట్రం కోసం పనిచేద్దాం అనే ఆలోచనతో అనేక మంది టీఆర్ఎస్ పార్టీలోకి రావడం, పెద్ద పదవులు సాధించడం జరిగింది. ఏదేమైనప్పటికీ రాజకీయాల్లో అందరిని కలుపుకుపోవడమే నాయకుని యొక్క సహజ లక్షణం. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఉద్యమకారుల వైపు కేసీఆర్ చూపు తగ్గుతూ వచ్చింది. కేవలం కొద్దిమంది ఉద్యమకారులకు మాత్రమే పెద్ద పదవులు, చైర్మన్లు దక్కాయి. ఉద్యమ కేసుల కొట్టివేతలు, పరిహారం వంటి అంశాల్లో ఆనాడు ప్రభుత్వం కొంత నిర్లక్ష్యం చేసిందనేది వాస్తవం. 2018 ఎన్నికలు కేసీఆర్ మార్క్ రాజకీయాలకు నిదర్శనం. ఆ ఎన్నికల్లో కేసీఆర్ శక్తి దేశవ్యాప్తంగా తెలిచేలా చేసింది. 2018 తరవాత మరింతగా ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయడం ప్రారంభమైంది. క్రింది స్థాయి కార్యకర్తలు మరియు ఉద్యమకారులతో కేసీఆర్‌కు భారీ గ్యాప్ వచ్చింది. కేవలం కొద్దిమంది స్వార్ధ రాజకీయ నాయకులు మాత్రమే లాబీగా మారి పూర్తిగా ఉద్యమకారులను, క్రింది స్థాయి కార్యకర్తలను నిర్లక్ష్యం చేశారు. దీని ప్రభావం 2023 ఎన్నికలో స్పష్టంగా కనపడింది. ఉద్యమకారుల్లో బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కనపడింది.

**ఇప్పటి ప్రభుత్వంపై ఉన్న సవాళ్లు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 సంవత్సరాల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. చాలా మంది ఉద్యమకారులు ఈ ఎన్నికలో కాంగ్రెస్ వైపు నిలపడ్డారనేది వాస్తవం. ఈ ప్రభుత్వమైనా ఉద్యమకారులను పట్టించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉంది. వీరు ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇల్లు చాలా కీలకం. అనేక మంది ఉద్యమకారులు నిరుపేద కుటుంబాలకు చెందిన వాళ్లే ఎక్కువ. కావున ప్రభుత్వం వీరిని ప్రత్యేక దృష్టి సారించి 250 గజాల గృహాలను నియోజకవర్గానికి కనీసం 500 ఇండ్ల చొప్పున ఉద్యమకారుల కోట కింద ఇవ్వాలని ఉద్యమకారులు కోరుతున్నారు. అలాగే ఉద్యమ కారులకు పెన్షన్ ఇవ్వాలని ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్. కానీ బీఆర్ఎస్ పార్టీ తోవలోనే రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తుందనండలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు ఉదాహారణే ప్రొఫెసర్ కోదండరాం సార్. ఆయనకు ఇప్పటికీ ప్రభుత్వం సముచిత స్థానాన్ని కల్పించలేదన్నది జగమెరిగిన సత్యమే. ప్రభుత్వం నియమించే చైర్మన్ పదవుల్లో సైతం సముచేత స్థానాన్ని ఉద్యమకారులకు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఒక ప్రత్యేక సర్వే నిర్వహించి రాష్ట్రంలో ఉద్యమకారులని లెక్కగట్టి ప్రత్యేక స్థానాన్ని కల్పించాలి.




**ఉద్యమ కాగడను వెలిగించింది ఎల్బీనగర్‌లోనే..**

తెలంగాణ ఉద్యమంలో ఎల్బీనగర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఇంటికో దివిటిలా ఉద్యమ కాగడ వెలిగించారు. ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఆంధ్రా పాలకులను తరిమికొట్టడంతో ముఖ్య భూమిక పోషించారు. శ్రీకాంతాచారి బలిదానం తర్వాత ఎల్బీనగర్ ప్రాంతంలో ఉద్యమం మరింత బలోపేతం అయింది. చావో రేవో అన్నట్లు తెగబడి మరీ పోరాడారు. పోలీసుల లాఠీదెబ్బలు, రబ్బరు బులెట్లను లెక్కచేయకుండా ఉద్యమకారులు కదం తొక్కారు. కేసీఆర్‌కు బాసటగా నిలిచి ఆంధ్రపాలకులను తెలంగాణ సరిహద్దులు దాటేలా తరిమికొట్టారు. కానీ స్వరాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులు కేసీఆర్‌కు కరివేపాకులా మారిపోయారు. కరడుగట్టిన ఉద్యకారులను ముందుంచి పోరాడిన కేసీఆర్ అధికారంలోకి రాగానే వారి ఉనికే ప్రశ్నార్థకం చేశారు. ఎమ్మెల్యే టికెట్లు కాదు కదా.. కనీసం నామినేటెడ్ పదవులు కూడా ఇవ్వలేదు. ప్రశ్నించే గొంతులను నొక్కేసి.. అసలు ఉద్యమం అనే మాటనే లేకుండా పోలీసులతో వారిపై ఉక్కుపాతం మోపారు. అదే కేసీఆర్ ఓటమికి నాంది పలికింది. కేసీఆర్ పోకడలకు నిరసనగానే 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం' ఆవిర్భవించింది. ఈ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారులకు చేయూతనిచ్చి వారి సమస్యలను తీర్చడానికి బాసటగా నిలిచింది. ఉద్యమకారులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడంతోపాటు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలని గత పదేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. కానీ అమరుల కుటుంబాలనే గాలికి వదిలేసిన కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను పూచిక పుల్లతో సమానంగా చూసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఉద్యమకారులకు పట్టించుకునేలా కనిపించడం లేదు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో కొనసాగితే 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం' ఆధ్వర్యంలో మరో ఉద్యమం తప్పకపోవచ్చు. ఆంధ్ర పాలకునే తరిమికొట్టిన ఉద్యమకారులకు తెలంగాణ ప్రభుత్వం మెడలు వంచడం పెద్దలెక్క కాదు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**చివరగా ..**

తెలంగాణలో రాజకీయ చైతన్యం చాలా గొప్పది. బీఆర్ఎస్ పార్టీకి బలం తెలంగాణ నినాదం. కేసీఆర్ తిరిగి మళ్లీ ఉద్యమకారులతో దశల వారీగా సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈరోజు పార్టీ నుంచి వెళ్తున్న వారు ఎవ్వరూ ఉద్యమాలు చేయలేదు. పార్టీ కోసం కష్టపడలేదు. కేవలం అధికారం కోసం పార్టీ వెంబడి నడిచారు. ఇప్పుడు వెళ్లిపోతున్నారు. ఇకనైనా ఉద్యమకారులకు సముచిత స్థానాన్ని కల్పించాలని కోరుతున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు సైతం నెరవేర్చే పరిస్థితుల్లో లేదు. చంద్రబాబు సైతం మళ్ళీ తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడం కోసం కృషి చేస్తున్నారు. కావున మళ్ళీ తిరిగి తెలంగాణ సొంత రాజకీయ అస్థిత్వం వైపు నిలబడాలి అంటే ఉద్యమకారుల పాత్ర కీలకం కావాల్సిందే.



- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్ చైర్మన్,
సీఎండీ విశ్వంభర తెలుగు దిన పత్రిక

# కాసుల కక్కుర్తితో కడుపు కోస్తారా?

- అవసరం లేకున్నా గర్భసంచుల తొలగింపు హేయం.. అమానవీయం
- అనవసర హిస్టరెక్టమీ ఆపరేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం
- అవగాహన సదస్సులో మేధావుల పిలుపు



**విశ్వంభర, హైదరాబాద్** : కాసుల కక్కుర్తితో కొందరు డాక్టర్లు, కార్పొరేట్ ఆసుపత్రుల వారు అవసరం లేకున్నా మహిళల గర్భసంచులను తొలగించే హిస్టరెక్టమీ ఆపరేషన్లను చేయడం అత్యంత హేయమని పలువురు మేధావులు, పదవీ విరమణ చేసిన ఉన్నతాధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇటీవల తిరిగి ఈ ఆపరేషన్లు పెరగడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. చికిత్సతో జబ్బు తగ్గే అవకాశాలు ఉన్నా మహిళలను భయపెట్టి ఈ ఆపరేషన్లకు సిద్ధం చేయడం అమానుషమని అభిప్రాయపడ్డారు. "ఒకప్పుడు పోలీసులంటే భయపడేవాళ్లం... ఇప్పుడు డాక్టర్లను చూసి భయపడాల్సివస్తోంది, వైద్యో నారాయణో హరి అంటారు. వైద్యుడికి, రోగికి మధ్య నరనారాయణ సంబంధం కాదు కదా కనీస చర్చ కూడా ఉండటం లేదు. చాలా మంది రోగిని చేయిపట్టి కూడా చూడటం లేదు. ఒక్క ముక్కా మాట్లాడటం లేదు" అని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం పూర్తిగా వ్యాపారమయమైన ప్రస్తుత పరిస్థితులలో లైఫ్ హెల్త్ రీయిన్‌స్ఫోర్స్‌మెంట్ గ్రూప్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి అనసవర హిస్టరెక్టమీలను నిరోధించేందుకు డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ సూర్యప్రకాశ్ దంపతులు చేస్తున్న ఉద్యమానికి అండగా నిలుస్తామని వర్క్ సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ (సీడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ తార్నాక లోని సత్యోదయం రీట్రీట్ సెంటర్‌లో జరిగిన సదస్సులో వారు పాల్గొన్నారు. డాక్టర్‌గా పాతికేళ్ల సేవాకాలం పూర్తి చేసిన డాక్టర్ కామేశ్వరిని ఈ సందర్భంగా సన్మానించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఆమెను అభినందించారు. ఆత్మీయతతో, ప్రేమతో ఒక అమ్మలా ఆమె వేలాదిమంది మహిళల జీవితాల్లో వెలుగులు పూయిస్తున్నారని కొనియాడారు. సహజమైన పద్ధతులతో, ఆహార నియమాలతో, అతి తక్కువ మందులతో వేల మందికి సంతాన సాఫల్య కల నెరవేరుస్తున్నారన్నారు.

**డాక్టర్ కామేశ్వరి ఆదర్శప్రాయురాలు**

మహిళల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించేందుకు, గర్భసంచి పరిరక్షణ అవసరాన్ని తెలియజెప్పేందుకు భర్త డాక్టర్ సూర్యప్రకాశ్ తో కలిసి ఆమె కృషి చేస్తున్న తీరు ప్రశంసనీయమని సీడబ్ల్యూఎస్ గౌరవ కన్వీనర్ ఎంవీ శాస్త్రి అన్నారు. వైద్యునికి, రోగికి మధ్య ఆత్మీయ సంబంధం ముఖ్యమని , ఆ విషయంలో డాక్టర్ కామేశ్వరి ఆదర్శప్రాయురాలని మహిళా ఉద్యమ నాయకురాలు ప్రొఫెసర్ రమా మెల్కోటే కొనియాడారు. తనకు వచ్చిన జబ్బు, తీసుకుంటున్న చికిత్సల గురించి తెలుసుకునే అవకాశం రోగికి ఉండాలన్నారు. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో డాక్టర్లు రోగులతో మాట్లాడే పరిస్థితి కూడా లేకపోవడం శోచనీయమన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, చికిత్స గురించి వివరించకుండా 19,20 ఏళ్ల యువతులకు కూడా గర్భసంచులను తొలగించడం దారుణమన్నారు. సాధారణ తలనొప్పికి కూడా సీటీస్కాన్ చేయించే పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు.

**అవసరం లేకున్నా వైద్య పరీక్షలా?**

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చక్రపాణి మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అవసరం లేకున్నా అన్ని వైద్య పరీక్షలు చేయించే ధోరణిని నిలువరించాలన్నారు. ఈ దిశగా చైతన్యం కలిగించడానికి ఎలక్ట్రానిక్, డిజిటల్ మాధ్యమాలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లమడి (గర్భసంచి) తొలగింపు అమానవీయమని ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్ రావు అభిప్రాయపడ్డారు. ఈ దుస్థితికి ప్రైవేట్, పెట్టుబడి దారి శక్తుల దోపిడీ తత్వం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం, ప్రజల నిర్లిప్తత , అచేతనత్వం, పురుషుల్లో అవగాహన లేమి కారణాలన్నారు. ఈ పరిస్థితుల్లో డాక్టర్ కామేశ్వరి దంపతులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలను చైతన్య పరచడంలో సాంస్కృతిక బృందాలను, కవులు, గాయకులు,కళాకారులను భాగస్వాములు చేయాలని సూచించారు. డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ విజయ్‌కుమార్, మంజు, వర్ఘీస్, విహారి, కందుకూరి రమేశ్‌బాబు, మల్లికార్జున్‌రావు, సుధామ తదితరులు మాట్లాడారు.

**అనుభవాల ఆధారంగా ముందుకు..**

సమాజంపై తనకు నమ్మకముందని, రానున్న ఇరవై ఏళ్లో ప్రపంచంలో అతితక్కువ హిస్టరెక్టమీ ఆపరేషన్లు జరిగే దేశంగా భారత్ నిలుస్తుందని డాక్టర్ కామేశ్వరి ఈ సందర్భంగా అన్నారు. ఆ దిశగా జరిగే ప్రయత్నంలో తమ వంతు పాత్ర పోషిస్తామని తెలిపారు. తప్పులు దిద్దుకుంటూ వైద్యం ముందుకు వెళ్తుందన్నారు. కేవలం పుస్తకాల్లో చదివిన దానితో వైద్యం సాధ్యం కాదని, అనుభవాల ఆధారంగా నేర్చుకోవలసి ఉంటుందని, తెలుసుకోవలసింది ఇంకా చాలా ఉందని తెలిపారు. ఎవరు తప్పులు చేస్తున్నారన్నది ముఖ్యం కాదని, సరిదిద్దుకుంటూ సాగడమే మన కర్తవ్యమన్నారు. మహిళల్లో ఆరోగ్యం , ఆహారం పట్ల చైతన్యం కలిగించడానికి తాము చేస్తున్న కృషికి అందరూ అండగా నిలవాలని, కలసి రావాలని డాక్టర్ సూర్యప్రకాశ్ కోరారు.

# ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలి



**డా. కాచం సత్యనారాయణ గుప్త**

**విశ్వంభర, ఎల్బీనగర్** : శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని వెంటనే కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ గుప్త డిమాండ్ చేశారు.

బాబు జగ్జీవన్ రామ్ భవనంలో శుక్రవారం నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల భూమిని, పెన్షన్ ఇచ్చే విధంగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు, ఉద్యమకారుల బాధ్యత కోదండరాం సారు తీసుకోవాలన్నారు. ఉద్యమకారులకు హెల్త్ కార్డులు కూడా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్, ఎల్బీనగర్ టీజేఏసీ చైర్మన్ కేవీ రంగారెడ్డి, టీజేఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొత్త రవి గుప్త, ఉప్పల శ్రవణ్, బిరెల్లి వెంకట్ రెడ్డి, రమేష్, కృష్ణా గుప్త, శ్రీధర్, ఏ ఆంజనేయులు గుప్త, శ్యామ్ సుందర్, సువర్ణ చలమరెడ్డి, మాణిక్ రెడ్డీ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చెయ్యాలి



**విశ్వంభర, హైదరాబాద్** : ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చెయ్యాలి అర్హులైన బీసీ విద్యార్థులందరికి పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలి, బీసీ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయాంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయి దాదాపు రూ.5,000 కోట్లకు పైగా పేరుకుపోయి ఉన్నాయని ఆ బకాయిలను గత ప్రభుత్వం సకాలంలో విద్యాసంస్థలకు అందజేయకపోవడం వల్ల అనేక విద్యాసంస్థలలో చదువుకునే బీసీ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. వాటిని వెంటనే విడుదల చేసి విద్యార్థుల చదువులకు సహకరించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి వినతిపత్రాన్ని అందించారు. అదేవిధంగా బీసీ విద్యార్థులు EAPCET ద్వారా అర్హత సాధించిన మరియు అనేక పోటీ పరీక్షల ద్వారా వృత్తి విద్యా కోర్సుల్లో ఎంపికైన విద్యార్థులందరికీ, అర్హులైన బీసీ విద్యార్థులందరికీ ప్రభుత్వమే పూర్తిస్థాయి ఫీజులు చెల్లించాలని కోరారు.

# మత్స్యశాఖ అధికారులతో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సమీక్ష

**విశ్వంభర, హైదరాబాద్** : తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మత్స్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మత్స్యశాఖ కమీషనర్ ప్రియాంక అలా గారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో "తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్" మెట్టు సాయికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న సాయికుమార్‌కు జిల్లా స్థాయి అధికారులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ఎంతో నమ్మకంగా సీఎం రేవంత్ రెడ్డి తనకి చైర్మన్ పదవి బాధ్యతలు అప్పగించినందుకుగాను పదవికి, మత్స్యశాఖకి ఎలాంటి భంగం కలుగకుండా ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని మత్స్యశాఖ అధికారులు కూడా నిబద్ధతతో పనిచేసి మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పడాలని ఆదేశించారు. మత్స్యశాఖలో ఎలాంటి అవినీతి జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.





## ఒకరు ప్రేమంటూ..
# మరొకరు పెళ్లంటూ..

**యువకుల టార్చర్ భరించలేక యువతి ఆత్మహత్య**

**విశ్వంభర, నల్లగొండ :** నిర్భయ లాంటి ఎన్ని చట్టాలు ఉన్నా.. ఎన్ని శిక్షలు విధించినా.. ప్రేమోన్మాదులు మాత్రం ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. తాజాగా.. నల్లగొండ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది.. ఒకే వీధిలో ఉండే ఇద్దరు యువకులు.. ఓ యువతి దారుణంగా హింసించారు.. పెళ్లి చేసుకోవాలని ఒకరు, ప్రేమించాలని మరొకరు వేధించారు. తాము చెప్పినట్లుగా వినకపోతే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఫొటోలను పెడతామని బెదిరించారు. దీంతో ప్రేమోన్మాదుల వేధింపులు తాళలేక చివరకు ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన కొత్త రామలింగం రజిత దంపతులకు కుమారుడు, కుమార్తె కల్యాణి(18) ఉన్నారు. కల్యాణి పాలిటెక్నిక్ పూర్తి చేసి హైదరాబాద్ ప్రైవేట్ ఉద్యోగం చేసింది. కొంతకాలంగా ఆమె ఇంటి వద్దే ఉంటోంది. ఒకే గ్రామానికి చెందిన ఆరూరి శివ, కొమ్మనబోయిన మధులు స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. ఒకే ఊరు వారు కావడంతో ఆరూరి శివ, కొమ్మనబోయిన మధులతో కల్యాణికి పరిచయం ఉంది. అయితే శివ, కొమ్మనబోయిన మధులు కల్యాణిని ఇష్టపడుతున్నారు. వీరిద్దరూ కొద్దిరోజుల కిందట కల్యాణి ఫోన్ నెంబర్‌ను తెలుసుకొని ఆమెకు తరచూ ఫోన్లు చేయడం ప్రారంభించారు. ఒకే ఊరు కావడంతో ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకుని తనను ప్రేమించాలని శివ, తనను పెళ్లి చేసుకోవాలని మధులు అడుగుతున్నారు. వీరిద్దరి ప్రేమ, పెళ్లి విషయాన్ని కల్యాణి నిరాకరించింది. వారితో మాట్లాడడం కూడా బంద్ చేసింది. దీంతో శివ మధులిద్దరూ.. వాట్సాప్‌లో ఆమె డీపీగా (డిస్ప్లే పిక్చర్) పెట్టుకున్న ఫొటోలను తీసుకుని వాటిని తమ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో.. స్టేటస్‌గా పెట్టుకుంటామని బెదిరించారు. చెప్పినట్లు వినాలంటూ పదే పదే టార్చర్ పెట్టడంతో ఇద్దరు యువకులు వేధింపులు తాళలేక కల్యాణి ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. వెంటనే గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు కల్యాణి మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆ తర్వాత నల్లగొండలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ కల్యాణి మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తమ కుమార్తె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ గ్రామస్తుల పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తన ఆత్మహత్యకు కారకులు శివ, మధులేనని కల్యాణి జడ్జికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొంది. కల్యాణి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, నిందితులు శివ, మధులు పరారీలో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు.

# ఇంటి బయట కాపలా కాసిన ఇల్లాలు..

**ఇంట్లో భర్తను హత్య చేసిన ప్రియుడు!**






**విశ్వంభర, కొత్తగూడెం :** సాఫీగా సాగిపోతున్న వారి కాపురంలో అనుకోని అతిథి చిచ్చు రాజేశాడు. అతని మాయలో పడిన భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. ఈ అమానవీయ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. హత్యవెనుక దాగిఉన్న విస్తుపోయే నిజాలు పోలీసు విచారణలో ఒక్కొక్కటిగా ఆలస్యంగా బయటికొచ్చాయి. డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణం గౌతంపూర్ కాలనీకి చెందిన అరికె రమేశ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే ఏరియాలో నివాసం ఉంటోన్న సాహు ఈశ్వర్ కుమార్ (38) భార్య ఎండీ రెహనాతో కొన్నాళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. కొన్నాళ్ల క్రితం రెహనా భర్త ఈశ్వర్ కుమార్‌కు తెలిసి.. భార్యను నిలదీశాడు. ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. మరోవైపు రమేష్‌ను కూడా ఆ ఏరియా నుంచి తరిమేయాలనుకున్న ఈశ్వర్ అతని గురించి ఆరా తీశాడు. అ క్రమంలో రమేష్ సింగరేణి క్వార్టర్‌లో అక్రమంగా నివసిస్తున్నట్లు తెలుసుకుని, అతన్ని అక్కడ్నుంచి పంపించేయాలని నిశ్చయించుకున్నాడు. కొందరు స్థానికులతో కలిసి సింగరేణి అధికారులకు రమేష్‌పై ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన అధికారులు రమేశ్ కుటుంబాన్ని క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయించారు. మరోవైపు భర్త ఈశ్వర్ కుమార్ వేధింపులు తాళలేక రెహనా తన ప్రియుడు రమేశ్‌కు చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి ఎలాగైనా ఈశ్వర్ అడ్డు తొలగించుకోవాలని నిశ్చయించుకున్నారు. అతడితో కలిసి భర్త హత్యకు పథకం పన్నింది. ఈ క్రమంలో జులై 6న ఈశ్వర్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అతనిపై రమేశ్, అతడి బంధువు బట్టు చందు కత్తులతో దాడిచేశారు. ఇదే సమయంలో ఎవరూ తమ ఇంటివైపు రాకుండా రెహనా ఇంటిబయట కాపలా కాసింది. గతంలో ఇల్లు ఖాళీ చేయించాడనే కక్షతోనే రమేష్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు స్థానికులు, కుటుంబ సభ్యులను నమ్మించింది. కత్తిపోట్లకు గురైన ఈశ్వర్‌ను వెంటనే ఖమ్మంలోని ఓ ఆసుపత్రిరి తరలించగా.. అతడు అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. దీనిపై టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా హతుడి భార్యపై అనుమానం వచ్చి ఆమెను విచారించగా మొత్తం కుట్ర బయటపడింది. రెహనాతోపాటు రమేష్, అతడి బంధువును పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

# అర్ధరాత్రి డబుల్ మర్డర్

- ఆయబయట నిద్రిస్తున్న దంపతులపై తల్వార్‌తో దాడి
- స్పాట్‌లో భార్య, ఆస్పత్రిలో భర్త మృతి
- కూతురు, కుమారుడికి తీవ్రగాయాలు
- ప్రేమ వ్యవహారమే హత్యలకు కారణం
- వరంగల్ జిల్లా 16 చింతల్‌తండాలో ఘటన



**విశ్వంభర, వరంగల్ :** వరంగల్ జిల్లాలో డబుల్ మర్డర్ కలకలం రేపింది. ఓ ప్రేమోన్మాది.. ప్రియురాలి కుటుంబంపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు.. నిద్రిస్తున్న దంపతులను గొంతుకోసి కిరాతకంగా హత్య చేశాడు. తాను ప్రేమించిన యువతిని ఆమె తల్లిదండ్రులు తనకు దూరం పెట్టారన్న కక్షతో కిరాతకుడు తల్వార్ తో అత్యంత ఘోరంగా నరికి చంపాడు. ఈ క్రమంలో ప్రియురాలు, ఆమె సోదరుడిపై కూడా తల్వార్ తో దాడి చేశాడు.. ప్రస్తుతం వారిద్దరూ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16 చింతల్‌తండాలో జరిగింది. మృతులను బానోతు శ్రీను, సుగుణగా గుర్తించారు. యువతి కుటుంబం ఆరుబయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి తల్వార్‌తో దాడి చేశాడు.. ఈ ఘటనలో యువతి తల్లి స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయింది. ఆమె తండ్రిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గిర్నిబాయికి చెందిన నాగరాజు అలియాస్ బన్నీ 16 చింతలతండా దీపిక కొద్ది రోజులుగా ప్రేమించుకున్నారు..వీరు మూడు నెలలు సహజీవనం కూడా చేశారు. ఆ తర్వాత నాగరాజు ప్రవర్తన నచ్చకపోవడంతో ఈ పంచాయితీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. పోలీస్ స్టేషన్లో కాంప్రమైజ్ అయి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత.. తాను ప్రేమించిన యువతి తన నుంచి విడిపోవడానికి యువతి తల్లిదండ్రులే కారణమని.. మా ఇద్దరినీ విడదీశారని కోపంతో ప్రియుడు నాగరాజు(బన్నీ) ఆ కుటుంబంపై కక్షపెంచుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి శ్రీను కుటుంబం ఇంటి బయట నిద్రపోతుండగా.. బన్నీ కత్తితో అర్ధరాత్రి 1:35 నిమిషాల సమయంలో ఇంట్లోకి ప్రవేశించాడు.. అనంతరం నిద్రలో ఉన్న యువతి తల్లి బానోతు సుగుణ (40), శ్రీనివాస్ (45) పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో యువతి తల్లి బానోతు సుగుణ 40 అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రి బానోతు శ్రీనివాస్ (45) నర్సంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీపిక( 21), ఆమె సోదరుడు మదన్ (18) ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రేమోన్మాది కుటుంబాన్ని బలి తీసుకోవడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు బన్నీ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

## అతిథులను తీసుకురావడానికి
# 3 ఫాల్కన్-2000 జెట్లు

**పెళ్లి కోసం అద్దెకు తీసుకున్న అంబానీ ఫ్యామిలీ**



**విశ్వంభర, ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ ఇంట పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరుగుతోంది. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ శుక్రవారం ముంబైలో రాధికా మర్చంట్ మెడలో మూడు ముళ్లు వేయనున్నారు. వివాహానికి అతిరథ మహారథులు విచ్చేయనున్నారు. పెళ్లికి వచ్చే కొందరు ప్రత్యేక అతిథుల కోసం అంబానీ ఫ్యామిలీ మూడు ఫాల్కన్-2000 జెట్లను రెంటుకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతిథుల కోసం అంబానీ కుటుంబం మూడు ఫాల్కన్-2000 జెట్లను రెంటుకి తీసుకున్నారని, అలాగే, పెళ్లికి సంబంధించిన ఈవెంట్ల కోసం 100కు పైగా ప్రైవేట్ విమానాలను వాడాలని అనుకుంటున్నారని ఎయిర్ చార్టర్ కంపెనీ క్లబ్ వన్ ఎయిర్ సీఈవో రాజన్ మెహ్రా చెప్పారు. ప్రపంచంలోని నలుమూలల నుంచి అతిథులు వస్తున్నారని అన్నారు. ఆయా విమానాలు దేశంలోని అనేక ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో పెళ్లి జరగనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముంబై ట్రాఫిక్ పోలీసులు మూడు రోజుల పాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ నిశ్చితార్థం నుంచి ప్రీ వెడ్డింగ్ వేడుకల వరకు ఎంతో ఘనంగా జరిగాయి. ఇప్పుడు పెళ్లి వేడుక అంతకంటే ఘనంగా జరగనుంది.



## రీల్స్ పిచ్చితో మద్యం మత్తులో
# కారుతో విన్యాసాలు..

**మహారాష్ట్రలో ఇద్దరి దుర్మరణం**

**విశ్వంభర, నాగ్ పూర్ :** మద్యం మత్తులో రీల్స్ కోసం చేసిన ప్రయత్నం ఇద్దరు యువకుల ప్రాణాలను బలితీసుకుంది.. మరో ముగ్గురిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టింది. మంగళవారం తెల్లవారుజామున నాగ్ పూర్ లో జరిగిన కారు ప్రమాదం వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఈ వీడియోలో ఐదుగురు యువకులు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా రోడ్డు పక్కనే ఉన్న బారియర్ ను ఢీ కొట్టడం కనిపిస్తోంది. నాగ్‌పూర్‌లోని పంజారా గ్రామ సమీపంలో చోటుచేసుకుందీ ప్రమాదం. కారులోని యువకులంతా మద్యం మత్తులో ఉన్నారని, రీల్స్ కోసం కారును అతివేగంగా, అడ్డదిడ్డంగా నడిపారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. బోల్తా పడిన చోటు నుంచి కొన్ని మీటర్ల మేర ఈడ్చుకుపోయిందని చెప్పారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జుగా మారిందన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు స్పాట్‌లోనే చనిపోగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. ప్రమాదం సంగతి తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బందితో కలిసి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారి పరిస్థితి సీరియస్ గానే ఉందని వైద్యులు చెప్పారన్నారు.



## ఇంటి నుంచి భోజనం తెప్పించుకునే అవకాశం ఇవ్వండి : నటుడు దర్శన్

**విశ్వంభర, బెంగళూరు :** తన అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో జైలులో ఉన్న  కన్నడ స్టార్ నటుడు దర్శన్ తనకు కారాగారంలో ఇస్తున్న ఆహారం ఒంటికి సరిపడడం లేదని అన్నారు. ఇంటి నుంచి భోజనాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణను ఉన్నత న్యాయస్థానం జులై 18వ తేదీకి వాయిదా వేసింది. చిత్రదుర్గానికి చెందిన రేణుకాస్వామి హత్య కేసులో ఆయన ప్రస్తుతం పరప్పన అగ్రహార కారాగారంలో జ్యుడీషియల్ రిమాండులో కొనసాగుతున్న విషయం తెలిసిందే. జైల్లో ఇస్తున్న భోజనం తింటే తనకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయని, బరువు కూడా తగ్గిపోతున్నానని దర్శన్ ఆక్రోశిస్తూ, తన న్యాయవాదుల సహకారంతో ఉన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేశారు. ఇంటి భోజనం, పరుపు, చదువుకునేందుకు పుస్తకాలు తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వేసుకున్న అర్జీని జస్టిస్ ఎస్ఆర్ కృష్ణకుమార్ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కారాగారం రూల్ బుక్‌లో ఇంటి భోజనాన్ని తెప్పించుకునేందుకు ఎటువంటి నియమాలు ఉన్నాయని ప్రశ్నిస్తూ నోటీసులు జారీ చేశారు. దీనిపై ఆక్షేపణలు వ్యక్తం చేసేందుకు అనుమతించారు.



## పర్సనల్ మెయిల్ ఐడీని
# ప్రకటించిన లోకేశ్

- వినతులు ఆ మెయిల్ ఐడీకి పంపాలని విన్నపం
- లోకేశ్ వాట్సాప్ కు వెల్లువెత్తుతున్న వినతులు
- టెక్నికల్ సమస్యలతో బ్లాక్ అవుతున్న లోకేశ్ వాట్సాప్
- మెయిల్ పంపితే సమస్యలు పరిష్కరిస్తానన్న లోకేశ్

**విశ్వంభర, అమరావతి:** సమస్య ఏదైనా, సహాయం కావాలన్నా ఇకనుంచి తనకు hello.lokesh@ap.gov.in మెయిల్ ఐడీకి పంపాలని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంపుతున్న మెసేజ్‌లు పోటెత్తడంతో మంత్రి నారా లోకేశ్ వాట్సాప్ ను 'మెటా' బ్లాక్ చేసింది. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా అవిశ్రాంతంగా పనిచేస్తున్న మంత్రి లోకేశ్ వాట్సాప్ బ్లాక్ కావడం, తరచూ ఇదే సమస్య ఉత్పన్నం అవుతుండటంతో తన పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.in కి ప్రజలు తమ వినతులు, సమస్యలు పంపించాలని ఒక ప్రకటనలో కోరారు. సాయం కోసం వచ్చే ప్రజలకు తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎన్నికలకు ముందే నారా లోకేశ్ ప్రకటించారు. ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రతి రోజు ప్రజల్ని కలిసి వారి సమస్యలు తెలుసుకునే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఉండవల్లి నివాసంలో నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో తన వాట్సాప్‌కి వచ్చిన మెసేజ్ కు రియాక్ట్ అయ్యి 25 మంది దివ్యాంగ విద్యార్థుల సమస్య పరిష్కరించారు. వేలాది మంది తమ సమస్యలను ఒకేసారి మంత్రి నారా లోకేశ్‌కి వాట్సాప్ చెయ్యడం వల్ల టెక్నికల్ సమస్యతో బ్లాక్ అయింది. తనకు సమాచారం పంపే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తానే హ్యాండిల్ చేసే పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.in కి సమస్యలను పంపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పాదయాత్రలో యువతకు తనను దగ్గరగా చేర్చిన "హలో లోకేశ్" కార్యక్రమం పేరుతోనే ఈ మెయిల్ ఐడీ క్రియేట్ చేసుకున్న మంత్రి... తానే అందరి సమస్యలు నేరుగా అడ్రస్ చేస్తానని ప్రకటించారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య-సహాయంకు సంబంధించిన పూర్తి వివరాలు వినతులలో పొందుపరచాలని సూచించారు. మెయిల్ చేస్తే తాను స్పందిస్తానని తెలియజేశారు. వాట్సాప్ తరచూ బ్లాక్ కావడంతో ప్రజలు పంపే మెసేజ్ లు చూసే అవకాశం ఉండటం లేదని, దయచేసి అందరూ మెయిల్ ఐడీకే వినతులు పంపించాలని నారా లోకేశ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్

- ఈ నెల 24 నుంచి తెలంగాణ బడ్జెట్ సెషన్స్
- రైతు భరోసా విధివిధానాలపై చర్చకు చాన్స్
- అసెంబ్లీ వేదికగా జాబ్ క్యాలెండర్ ప్రకటన
- సమావేశాలకు కేసీఆర్ హాజరుపై ఉత్కంఠ

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సమీక్షా సమావేశం కూడా నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్‌లు, సీఎస్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇక జులై 24 నుంచే బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. దానికి అనుగుణంగానే రాష్ట్ర బడ్జెట్ కూడా ఉండనుంది. ప్రస్తుతం రైతు భరోసా విధివిధానాల ఖరారు కోసం ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ జిల్లాలలో పర్యటిస్తోంది. ఈ కమిటీ సేకరించిన వివరాలపై అసెంబ్లీలో చర్చలు జరపనున్నారు. అలాగే పూర్తిస్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం కూడా ఉంది. జాబ్ క్యాలెండర్ ను సైతం ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### గులాబీ బాస్ మాట నిలబెట్టుకునేనా..?

ఇదిలాఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, శాసనసభా ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరు కాలేదు. దీంతో ఆయనపై అనేక విమర్శలు వచ్చాయి. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తారా అని ఎద్దేవా చేశారు. అయితే ఇటీవల కేసీఆర్ మాట్లాడుతూ... వచ్చే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతానని, ప్రజలకి అన్యాయం జరగకుండా ప్రభుత్వంపై కొట్లాడుతానని ప్రకటించారు. దీంతో ఆయన రాకపై కూడా కొంత ఆసక్తి నెలకొంది. తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం, జాబ్ క్యాలెండర్, అమలు కాని ఆరు గ్యారెంటీలపైనా బీఆర్ఎస్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది.

# తెలంగాణపై ఏఐసీసీ ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

గెలుపు, ఓటముల బాధ్యత రేవంత్ రెడ్డిదే.. ఎందుకంటే ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రెండూ రేవంతే కాబట్టి గెలుపోటములకు తానే బాధ్యత తీసుకోవాలి. రెండు హోదాల్లో అధిష్టానంతో మాట్లాడుకుని 17 పార్లమెంటు సీట్లలో అభ్యర్థులను రేవంత్ ఫైనల్ చేయించుకున్నారు. పోటీచేసిన వారిలో అత్యధికులు రేవంత్ మద్దతుదారులే. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకారమైతే పార్టీ 12 సీట్లలో ఆధిక్యత ప్రదర్శించింది. అలాగే అధికారంలోకి వచ్చిన వెంటనే సిక్స్ గ్యారెంటీస్ లో నాలుగు సంక్షేమపథకాలను రేవంత్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇక నరేంద్రమోడి మీద వ్యతిరేకత, బీజేపీ మీద వ్యతిరేకత తదితరాలను కలుపుకుంటే 14 సీట్లలో పార్టీ గెలుస్తుందని ఐఏసీసీ అంచనా వేసుకున్నది. ఇదే విషయాన్ని ఎన్నికలకు ముందు నుండే రేవంత్ తో పాటు అందరికీ చెప్పి టార్గెట్ రీచయ్యేందుకు గట్టిగా పనిచేయాలని చాలాసార్లు చెప్పింది. అయితే పార్టీకి వచ్చింది 8 సీట్లు మాత్రమే. బీజేపీ గెలిచింది కూడా 8 సీట్లే అయినా 2019లో నాలుగు సీట్ల బలాన్ని నూరుశాతం పెంచుకుని 8 సీట్లకు ఎదిగింది. అధికారంలో ఉండి, సంక్షేమపథకాలు అమలుచేస్తు, నేతలందరు ఏకతాటిపైకి వచ్చి పనిచేసినా 8 సీట్లలో మాత్రమే పార్టీ గెలవటాన్ని ఐఏసీసీ సీరియస్ గా తీసుకుంది. అందుకనే ఓడిపోయిన తొమ్మిది నియోజకవర్గాలపై విశ్లేషించేందుకు ముగ్గురు సభ్యుల కమిటిని నియమించింది. ఆ కమిటీనే బుధవారం రాత్రి హైదరాబాద్ కు వచ్చింది. పార్టీ ఓడిపోయిన సిద్ధిపేట, చేవెళ్ళ, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, కరీంనగర్, నిజామాబాద్ లో పోటీచేసిన అభ్యర్ధులతో కమిటి మాట్లాడుతుంది. ఓటమికి వాళ్ళకోణంలో కారణాలను నోట్ చేసుకుంటుంది.

### ఓడిపోయే అభ్యర్థులకు టికెట్లు ఎందుకిచ్చారు..?

అలాగే పార్లమెంటు పరిధిలో పనిచేసిన మంత్రులు, ఎంఎల్ఏలు, సీనియర్ నేతలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ద్వితీయశ్రేణి నేతలను కూడా కలిసి కారణాలను కమిటీ తెలుసుకుంటుంది. అందరితో మాట్లాడిన తర్వాత చివరగా రేవంత్ రెడ్డితో పాటు పార్టీ ఇన్చార్జి దీపాదాస్ మున్షీతో కూడా కమిటి సభ్యులు భేటీ అవుతారు. చివరగా తమ రిపోర్టును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి కమిటీ అందిస్తుంది. అభ్యర్ధుల ఓటమికి రేవంత్ మాట్లాడుతు కొన్ని నియోజకవర్గాల్లో బలహీనమైన అభ్యర్ధులను దించటం, కాంగ్రెస్ ఓటమిని టార్గెట్ చేసుకుని బీఆర్ఎస్ నేతలు తమ ఓట్లను బీజేపీకి అనుకూలంగా మళ్ళించటమే కారణమని చెప్పారు. అయితే రేవంత్ చెప్పిన కారణాలతో ఐఏసీసీ ముఖ్యనేతలు ఏకీభవించినట్లు లేదు. పోటీలో బలహీనమైన అభ్యర్ధులను ఎవరు దింపారు ? ఎందుకు దింపారు అన్నది కీలకమైన పాయింట్.సికింద్రాబాద్ లో ఓడిపోయిన దానం నాగేందర్, మల్కాజ్ గిరిలో సునీతా మహేందర్ రెడ్డి, మెదక్ లో నీలం మధు, చేవెళ్ళల్లో గడ్డం రాజీవ్ రెడ్డి, మహబూబ్ నగర్లో చల్లా వంశీచంద్ రెడ్డికి టికెట్లు ఇవ్వాలని రేవంతే పట్టుబట్టినట్లు పార్టీ వర్గాల సమాచారం. అలాగే కరీంనగర్లో పోటీచేసిన వెలిచాల రాజేందర్‌రావు, హైదరాబాద్ సీటులో పోటీచేసిన మహమ్మద్ వలీయుల్లా సమీర్ అభ్యర్ధిత్వాలు చివరినిముషం వరకు ఖరారు కాలేదు. ఒకవేళ ముందే ఫైనల్ చేసున్నా హైదరాబాద్ సీటులో కాంగ్రెస్ గెలుపు కష్టమే. నిజామాబాద్ లో పోటీచేసిన తాటిపర్తి జీవన్ రెడ్డి డైరెక్టుగా టికెట్ తెచ్చుకున్నారు. ఆదిలాబాద్ లో పోటీచేసిన ఆత్రంసుగుణ గట్టి పోటీనే ఇచ్చినా ఓడిపోయారు.

### సీఎం నియోజకవర్గంలో బీజేపీకి ఆధిత్యం

ఓడిపోయిన తొమ్మిది సీట్లలో డైరెక్టుగా రేవంత్ బాధ్యత తీసుకోవాల్సింది సికింద్రాబాద్, చేవెళ్ళ, మల్కాజ్ గిరి, మహబూబ్ నగర్, సిద్ధిపేటలో. విచిత్రం ఏమిటంటే మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోనే రేవంత్ ప్రాతిని ధ్యం వహిస్తున్న అసెంబ్లీ సీటు కొడంగల్ కూడా ఉండ టం. పైగా కొడంగల్ లో బీజేపీకి మెజారిటి వచ్చింది. ఐఏసీసీ కోణంలో చూస్తే రేవంత్ పనితీరుకు 50 శాతం మార్కులు మాత్రమే వస్తాయి. అందుకనే అంచనా మేరకు రాని సీట్ల విషయంలో ఏఐసీసీ బాగా సీరియస్ గా ఉంది. ఏఐసీసీ నాయకత్వం ఎప్పుడు ఎవరిని పైకి ఎత్తుతుందో? ఎప్పుడు ఎవరిని పక్కన పెట్టేస్తుందో ఎవరూ చెప్ప లేరు. కాబట్టి ఓడిపోయిన నియోజకవర్గాలపై విశ్లేషణ అని చెబుతున్నా నిజానికి జరుగుతున్నది రేవంత్ పనితీ రుపై విశ్లేషణ అనే చెప్పాలి. ఓడిపోయిన అభ్యర్ధులు తొ మ్మిది మందితో కమిటి ముందు మాట్లాడటంలో ఉద్దేశ్యం క్షేత్రస్థాయిలో జరిగిన పరిణామాలను తెలుసుకోవటమే. వీళ్ళనుండి వచ్చిన ఫీడ్ బ్యాక్ తో మిగిలిన వాళ్ళతో మాట్లాడేటపుడు క్రాస్ చెక్ చేసుకుంటుంది కమిటి. ఏదేమైనా కమిటి ఏఐసీసీకి ఇచ్చే రిపోర్టు మీదే రేవంత్ భవిష్యత్తు ఆధారపడుతుందనటంలో సందేహంలేదు.

# నేడు కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే?

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జంప్
- ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో హస్తం గూటిలోకి..
- ధ్రువీకరించిన ఎమ్మెల్యే అనుచరులు

**విశ్వంభర, రాజేంద్రనగర్ :** మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు దెబ్బ మీద దెబ్బ పడుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి ప్రతిపక్ష పాత్రకి వచ్చేసరికి ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు చేజారిపోతున్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇప్పుడు తాజాగా గ్రేటర్ హైదరాబాద్‌కు సంబంధించి మరో ఎమ్మెల్యే హస్తం గూటికి వెళ్ళేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జూలై 12వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నట్లు ఆయన అనుచరులు చెప్తున్నారు. ఆయనతో పాటు మరికొంతమంది నియోజకవర్గ నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారన్న టాక్ వినిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మొట్టమొదటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కావడం విశేషం. అయితే కేవలం ఒక ఎమ్మెల్యేగా నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు తాను రేవంత్ రెడ్డితో భేటీ అయ్యానని చెప్పుకొచ్చారు. ఇందులో రాజకీయం లేదని అప్పట్లో ఆయన తేల్చి చెప్పారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే అనేక సమావేశాలకు హాజరయ్యారు. కేసీఆర్ ఫామ్ హౌస్ కూడా వెళ్లి ఆయనతో చాలాసార్లు భేటీ అయ్యారు. పార్టీ మారే ప్రసక్తే లేదు. నియోజకవర్గంలో కార్యకర్తలు కూడా పార్టీ మార వద్దంటూ చెబుతున్నారంటూ ఆయన గతంలో మీడియాతో చెప్పారు. కానీ తాజాగా సీఎం నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్నట్లుగా కచ్చితంగా సమాచారం అందుతోంది. అటు కాంగ్రెస్ పార్టీ సైతం దీనిని ధ్రువీకరించింది. ఇప్పటికైతే ప్రకాష్ గౌడ్ మాత్రమే వెళ్తున్నట్లు వార్తలు వస్తున్నా, మరో ఐదారుగురు గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.

# మంత్లీ టార్గెట్స్ పెట్టి రాష్ట్ర ఆదాయం పెంచాలి

- ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం ఆశాజనకంగా లేదు
- పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలి
- సమీక్షలో అధికారులు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం




**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్టానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను తయారు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సాధించిన పురోగతిని బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై, పన్నుల వసూళ్లపైన అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర వ్యవస్థీకరించుకోవాలని, ఆదాయం రాబట్టేందుకు వీలైన్ని సంస్కరణలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో దాదాపు 4 గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకా నెలా మంత్లీ టార్గెట్ ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు.

### ఆదాయాన్ని పెంచండి

ప్రధానంగా రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు.

### ఇసుక, ఖనిజ వనరులపై ఫోకస్

రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అటు కమర్షియల్ నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే వరుసలో పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా.. అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# సీఎం సొంత జిల్లాలోనే మేఘ కృష్ణారెడ్డికి రూ.1100 కోట్ల కాంట్రాక్ట్

- చీకటి జీవోలతో సర్కారు నడిపిస్తున్న రేవంత్ రెడ్డి
- మేఘతో తెలంగాణ సొమ్ము కక్కిస్తానన్న రేవంత్
- మళ్లీ మేఘాకే కాంట్రాక్ట్ ఇవ్వడం వెనుకున్న మతలబు ఏమిటి?
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర , హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా చీకటి ఒప్పందాలతో కాంట్రాక్టర్లకు దోచిపెడుతోందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రహస్య జీవోలతో సొంత జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి మేఘా కృష్ణారెడ్డికి రూ. 1100 కోట్ల కాంట్రాక్ట్ పనులు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చీకటి ఒప్పందాలు చేసుకొని జీవోలు తెచ్చి బలవంతపు వసూళ్లు చేస్తుందని అన్నారు. కేంద్రం నుంచి అమృత్ స్కీమ్‌లో రూ. 3వేల కోట్ల కాంట్రాక్టర్ల లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీన్ని మూడుగా డివైడ్ చేసి వెయ్యి కోట్లకు ఒక్కరిగా కాంట్రాక్టు ఇచ్చారన్నారు. మేఘా కృష్ణారెడ్డికి రూ. 11 వందల కోట్ల ప్రాజెక్ట్ ఇచ్చారని తెలిపారు. ఎక్సైజ్ కుంభకోణంలో ఉన్న రేవంత్ బామ్మర్ది సృజన్ అనే వ్యక్తి కి చెందిన శోధ కంపెనీకి రూ. 400 కోట్ల కాంట్రాక్టర్ ఇచ్చారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రూ. 600 కోట్లతో పూర్తి అయ్యే ప్రాజెక్ట్ ను వెయ్యి కోట్లకు ఇచ్చినట్లు చెప్పారు. 30 నుంచి 35 శాతం తక్కువకు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్దంగా ఉన్నారని తెలిపారు. అంటే ఇష్టం వచ్చినట్టు ఎస్టిమేట్ పొంచి కాంటాక్ట్స్ ఇస్తున్నారని ధ్వజమెత్తారు. మొత్తం కలిపి రూ. 1200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఏ ఒక్క జీవోను కూడా ఎందుకు పబ్లిక్ డొమైన్ లో పెట్టడం లేదని ప్రశ్నించారు. మేఘా కృష్ణారెడ్డి మీద కాళేశ్వరం ఎంక్వైరీ జరుగుతుంది కదా? ఆయన మీద జ్యుడిషియల్ ఎంక్వైరీ నడుస్తుందని అన్నారు. అలాంటప్పుడు ఆయన కంపెనీని బ్లాక్ చేయకుండా కాంట్రాక్టు ఎలా ఇచ్చారు? అని మండిపడ్డారు. మేఘా కృష్ణారెడ్డితో తెలంగాణ సొమ్ము కక్కిస్తాను చెప్పిన రేవంత్ రెడ్డి మళ్ళీ ఆయనకు కాంట్రాక్ట్ ఇవ్వడం వెనకున్న మతలబు ఏమిటి? అని అనుమానం వ్యక్తం చేశారు. మేఘా కృష్ణారెడ్డికి మీకున్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఇక కరీంనగర్ లో సీఎం తమ్ముడు పార్టనర్ అని చెప్తున్నారని చెప్పారు. రాబోయే కొడంగల్ టెండర్లలో కూడా మేఘాకు పెద్ద పీట వెయ్యబోతున్నారని అన్నారు. దీనికి ఎస్టిమేట్ ప్రయివేట్ ఇంజనీర్లు తో వేయించుకుంటున్నారని తెలిపారు. తాను అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిధుల్లో జరిగిన అవినీతిపై ఈడీ, సిబిఐ ఎంక్వైరీ కొరతామని ఈ సందర్భముగా మహేశ్వర్ రెడ్డి తెలిపారు

# కేసీఆర్, కేటీఆర్ కాళ్లు మొక్కినా..

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆ పార్టీలో ఉండటం లేదు

- పదేళ్లుగా సొంత పార్టీనేతలను అవమానించిన చరిత్ర కేసీఆర్‌ది
- నిరుద్యోగుల రెచ్చగొడుతున్న మీరు.. తెలంగాణలోని ఏ యూనివర్సిటీలోన అడుగుపెట్టే దమ్ముందా..?
- మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్ :** పదేళ్లుగా సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంటి గేటు లోపలికి రానివ్వకుండా తరిమికొట్టి వారిని కేసీఆర్ తీవ్రంగా అవమానించారని.. అందుకే ఇప్పుడు ఫామ్ హౌస్ కు పిలుచుకొని కాళ్ళు మొక్కినా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ పార్టీలో ఇమడలేక కాంగ్రెస్లోకి వస్తున్నారని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ వ్యాఖ్యానించారు. గురువారం గాంధీభవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుయాష్కి గౌడ్ గారు మాట్లాడుతూ... కనీసం నీ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏనాడైనా గౌరవించావా..? అందుకే నీకు ఈ గతి పట్టిందని పేర్కొన్నారు. టిడిపి నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్ కు, కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితా ఇంద్రారెడ్డికి ఏ విధంగా మంత్రి పదవులు ఇచ్చారని.. అప్పుడు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గుర్తు రాలేదా కేటీఆర్..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాక ముందే ఈ ప్రభుత్వం కొనసాగదని, కూలిపోతుందని, పడిపోతుందని.. ఒకవైపు కేటీఆర్, మరోవైపు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లు మాట్లాడారు. ఆఖరికి కాలు విరిగి యశోద ఆసుపత్రిలో పడుకున్న కేసీఆర్ కూడా ప్రభుత్వం ఉండదని రెచ్చగొట్టింది నిజం కాదా..? అని మధు యాష్కి గౌడ్ వ్యాఖ్యానించారు. కెసిఆర్ కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందని, అవినీతి చేస్తే కొడుకు అయినా బిడ్డ అయినా అల్లుడైన సహించేది లేదని చెప్పిన కెసిఆర్ కు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇరికిన బిడ్డ కవిత ను బయటకు తీసుకొచ్చేందుకు అపసోపాలు పడుతున్నారన్నారు. ఇందుకు మోడీతో కుమ్మక్కై బిడ్డను జైలు నుంచి విడిపించి.. తమ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలన్న కుట్ర చేశాడని ఆరోపించారు. అందుకే తమ పార్టీలోకి వచ్చే ఎమ్మెల్యేలను,ఎమ్మెల్సీలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలు కనీసం తమ సమస్యలు చెప్పుకునే హక్కు కూడా లేకుండా ధర్నా చౌక్ ని ఎత్తేసిన దుర్మార్గ చరిత్ర మీది కాదా..? ప్రజాస్వామ్యం రాజ్యాంగ హక్కుల గురించి మీరా మాట్లాడేది.? అని కేటీఆర్ పై మధుయాష్కిగౌడ్ ఫైర్ అయ్యారు. ఎంతోమంది నిరుద్యోగ యువత తమ ఆస్తులను తాకట్టు పెట్టి కోచింగ్ లు తీసుకొని.. పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు అన్నారు. కోచింగ్ సెంటర్ల నిర్వాహకుల నుంచి కమిషన్లు తినమరిగిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులు.. నిరుద్యోగులను పరీక్షలు వాయిదా వేయించాలని ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు కల్పించాలని కోరడం పోయి వాయిదా వేయించాలని చెప్పడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. పదేళ్లలో ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్, కేటీఆర్ హరీష్ రావులు... ఏ ఒక్క రోజైనా ఉస్మానియా యూనివర్సిటీకి అడుగు పెట్టారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా తెలంగాణలోని ఏ యూనివర్సిటీలోనైనా అడుగుపెట్టే దమ్ము మీకుందా..? అని ప్రశ్నించారు. పింక్ పార్టీల రౌడీలు విద్యార్థుల ముసుగులో.. డీఎస్సీ, గ్రూప్ -2 పరీక్షలు వాయిదా వేయించాలని కృత్రిమ ఉద్యమాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నిజమైన అభ్యర్థుల జీవితాలు ఆగం చేయాలని చూస్తున్నారని విమర్శించారు.




# రైతు బంధు తిరిగి చెల్లించండి..

- మేడ్చల్ రైతుకు ప్రభుత్వం ఆదేశం
- రూ.16 లక్షలు తిరిగి చెల్లించాలని నోటీసులు
- వెంచర్ భూమికి సర్కార్ సొమ్ము తీసుకున్నాడనే..

**విశ్వంభర, హైదరాబాద్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రైతుబంధుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయేతర భూములకు ఇచ్చిన రైతు బంధు వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ మండలం పోచారం రైతు యాదగిరిరెడ్డికి వెంచర్లపై ఇచ్చిన రైతుబంధు సొమ్ము రికవరీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రైతు బంధుగా తీసుకున్న రూ. 16 లక్షలు తిరిగి చెల్లించాలని ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. గతంలో 33 ఎకరాల భూమిని ప్లాట్లుగా చేసి యాదగిరిరెడ్డి అమ్మినట్లు ప్రభుత్వం గుర్తించింది. 33 ఎకరాల ప్లాట్ల భూమిపై రూ. 16 లక్షల రైతుబంధు చెల్లింపు యాదగిరిరెడ్డికి జరిగినట్లు వెల్లడించింది.

# ప్రజలను దోచుకుంటున్న జియో, ఎయిర్‌టెల్

**విశ్వంభర, హైదరాబాద్ :** జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు సెల్ రీచార్జీలను భారీగా పెంచాయి. జియో 12 నుంచి 25 శాతానికి పెంచితే, ఎయిర్ టెల్ 11 నుంచి 21 శాతానికి పెంచింది. ఈ పెంపుదలతో జియో, ఎయిర్ టెల్ కంపెనీల లాభాలు రూ.20 వేల కోట్లకు పెరుగుతాయని మీడియా చెపుతున్నది. మరోవైపు, ఈ చార్జీల పెంపుదల ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటటంతో కుదేలైన తక్కువ ఆదాయం గల ప్రజలను, ముఖ్యంగా శ్రామిక వర్గాన్ని బాగా దెబ్బతీస్తుంటే ఈ చార్జీల పెరుగుదల పిడుగుపాటు అయింది. ఒక్కొక్క వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం పెరుగుదల (యావరేజి రెవిన్యూ పర్ యూజర్) కోసం ఈ పెంపుదలను చేశామని టెలికం కంపెనీలు సమర్థించుకుంటున్నాయి. ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే ప్రకటన. ప్రయివేటు టెలికం కంపెనీలు ఇంత భారీగా చార్జీల ధరలు పెంచటానికి గల కారణం కనపడటం లేదు. జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ఇప్పటికే అత్యధిక లాభాలు దండుకున్నాయనేది కాదనలేని సత్యం.

202324 ఆర్థిక సంవత్సరంలో జియో రూ.20,607 కోట్లు నికర లాభం సంపాదించింది. ఇదే ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ టెల్ రూ.7467 కోట్లు నికరలాభం సంపాదించింది. అందుచేత, సామాన్య ప్రజలను పిండి వసూలు చేసే ఈ చార్జీల పెంపుదల బొత్తిగా అనవసరమైనది. టెలికం రంగంలో ట్రాయ్ నియంత్రణా సంస్థ ఉంది. లాభదాహార్తితో పనిచేసే ప్రయివేట్ టెలికం కంపెనీలు ప్రజలను దోచుకోకుండా చూడటం కూడా ఈ ట్రాయ్ విధుల్లో ఒకటి. అయితే, ఆచరణలో ఈ ట్రాయ్ ప్రయివేట్ టెలికం కంపెనీల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నది. 2016లో జియో తన సేవలను ప్రారంభించినప్పుడు నియంత్రణాసంస్థ నిబంధనలన్నిటినీ జియో అతిక్రమించింది. అప్పుడు ట్రాయ్ మూగజీవిలా చూస్తూ ఉండిపోయింది. ఆ సమయంలో జె.ఎస్ దీపక్ అనే సీనియర్ అధికారి టెలికం డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా ఉన్నారు. ఇతను జియో చేసిన తీవ్ర ఉల్లంఘనలపట్ల అభ్యంతరాలు లేవనెత్తుతూ, జియోపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ట్రాయ్‌కి లేఖ రాశారు. ట్రాయ్ ఎటువంటి చర్యను తీసుకోలేదు సరికదా, మోడీ ప్రభుత్వం టెలికం డిపార్ట్‌మెంట్ నుంచి జెఎస్ దీపక్‌ని రాత్రికి రాత్రే బయటకు నెట్టింది. ఇటువంటి పరిస్థితుల్లో, బిఎస్ఎన్ఎల్ మాత్రమే టెలికం రంగంలో నిజమైన నియంత్రణా సంస్థగా పనిచేసింది. బిఎస్ఎన్ఎల్ నుంచి ఉన్న తీవ్ర పోటీ కారణంగా తమ ఇష్టానుసారం టారిఫ్ చార్జీలను పెంచలేకపోయాయి. ఈ పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఏమైనా, ఈరోజు దాకా బిఎస్ఎన్ఎల్ 4జి, 5జి సేవలను ప్రారంభించలేక పోయింది. దీని ఫలితంగా ప్రవేటు కంపెనీలతో సమాన స్థాయిలో పోటీ పడటానికి అవరోధం ఏర్పడింది.




బిఎస్ఎన్ఎల్ లో 4జి, 5జి సేవలు అందుబాటులో లేనందువల్ల బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు హైస్పీడ్ డేటా సేవలు పొందే అవకాశం కోల్పోతున్నారు. దీనితో తప్పనిసరై, వినియోగ దారులు పెద్ద సంఖ్యలో బిఎస్ఎన్ఎల్‌ను వదిలి, జియో, ఎయిర్‌టెల్ వైపు మరలుతున్నారు. ట్రాయ్ విడుదల చేసిన లెక్కల ప్రకారం, 202324 ఒక ఏడాదిలోనే బిఎస్ఎన్ఎల్ భారీ స్థాయిలో 1.8 కోట్ల మంది వినియోగదారులను పోగొట్టుకుంది. 2024 మార్చి ఒక్క నెలలోనే 23.54 లక్షల మంది వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ వదిలి వెళ్లారు. అదే నెలలో రిలయన్స్ జియో 21.43 లక్షల మంది కొత్త వినియోగదారులను, ఎయిర్ టెల్ 17.5 లక్షలమంది కొత్త వినియోగదారులను పొందగలిగాయి. ఈ పరిణామాలన్నీ జియో, ఎయిర్ టెల్ భారీగా టారిఫ్ చార్జీలు పెంచడానికి ప్రోత్సహించాయి. బిఎస్ఎన్ఎల్ ఇప్పటిదాకా 4జి, 5జి సేవలను ఎందువలన ప్రారంభించలేక పోయింది? ఎందువలనంటే మోడీ ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌కు రెండు ప్రతిబంధకాలు కల్పించింది. ఒకటి: 2019లో బిఎస్ఎన్ఎల్‌కు అప్పుడున్న 3జి నెట్‌వర్క్ ను 4జి నెట్‌వర్క్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి అనుమతించలేదు. రెండు: తిరిగి 2020లో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్‌లతో విదేశీ అమ్మకందారుల నుంచి ప్రామాణికమైన 4జి పరికరాలను బిఎస్ఎన్ఎల్ కొనుగోలు చేయటాన్ని నిషేధించారు. భారతదేశ పరికరాల తయారీదారుల నుంచి మాత్రమే 4జి పరికరాలు బిఎస్ఎన్ఎల్ కొనవలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది.

2023 మే నెలలో, మాజీ సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఇక కొద్ది వారాలలో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు ప్రారంభిస్తుందని, అదే ఏడాది నవంబరు లేక డిసెంబర్ నాటికల్లా ఈ సేవలనే 5జికి అప్‌గ్రేడ్ చేస్తామని గొప్పలు చెప్పారు. అయితే, బిఎస్ఎన్ఎల్ కనీసం 4జి సేవలను సైతం ఈనాటికి కూడా ప్రారంభించలేక పోయింది. ఈ కారణాలన్నిటిని దృష్టిలో పెట్టుకొని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (బిఎస్ఎన్ఎల్ఇయు), బిఎస్ఎన్ఎల్ తన కస్టమర్లకు 4జి సేవలు అందించడానికి వోడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌ను వాడుకోవడానికి అనుమతివ్వమని డిమాండ్ చేసింది. వోడాఫోన్ ఐడియాలో ప్రభుత్వమే అతిపెద్ద వాటాదారుగా ఉన్నప్పుడు, ఈ ప్రతిపాదనను తేలికగా అమలులో పెట్టవచ్చు. కానీ అలా జరగలేదు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ డిమాండ్‌ను అమలులో పెట్టమని దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించింది. జియో, ఎయిర్ టెల్ తమ చార్జీలను భారీగా పెంచిన సందర్భంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, బిఎస్ఎన్ఎల్ తక్షణమే 4జి సేవలు ప్రారంభించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, దానిని త్వరగా 5జిగా అప్‌గ్రేడ్ చేయాలని సమాచార శాఖ మంత్రికి మరోసారి లేఖ రాసింది. 4జి, 5జి సేవలు ప్రారంభిస్తే సామాన్య ప్రజానీకానికి హైస్పీడ్ డాటా సేవలను, తక్కువ టారిఫ్ చార్జీలతో బిఎస్ఎన్ఎల్ అందించగలుగుతుంది.



## బాగ్ లింగంపల్లిలో పర్యటించిన కమిషనర్ ఆమ్రపాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో ఉన్న సమస్యలకు వెంటనే పరిష్కారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జోనల్ కమిషనర్ రవి కిరణ్ తో కలిసి సుందరయ్య పార్క్, మదర్ డైరీ పార్క్, వి.ఎస్.టి నుండి బాగ్ లింగంపల్లి వరకు ఫేస్ 2 ఫ్లైఓవర్ ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. సుందరయ్య పార్క్ లో వర్షపు నీరు నిలువడం మూలంగా ఇబ్బందులు వస్తున్నాయని, దాంతో పాటు టాయిలెట్ మరమ్మతులు చేపట్టాలని వాకర్స్ కమిషనర్‌ను కోరగా సమస్యలు వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎస్.ఎన్.డి.పి నాలా పనులు కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మదర్ డైరీ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వి.ఎస్.టి నుంచి బాగ్ లింగంపల్లి వరకు రెండు దశల్లో ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని గతంలో నిర్ణయించారు. అయితే మొదటి దశలో ఇందిరాపార్కు నుంచి విఎస్‌టి వరకు చేపట్టిన స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది.

## ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మరియు అధికారులతో కలసి డివిజన్ పరిధిలోని జింకలవాడ ప్రభాకర్ రెడ్డి నగర్ బస్తీ సరిహద్దులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభాకర్ రెడ్డి నగర్ జింకలవాడ సరిహద్దులో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురౌతుందని, ఇట్టి భూమిని సర్వే చేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయమని, అలాగే హద్దులు పెట్టాల్సిందిగా ఎమ్మార్వో, ఆర్ఐను ఆదేశించారు.

## తెలంగాణ డీజీపీని కలిసిన జర్నలిస్టులు



**విశ్వంభర, హైదరాబాద్ :** నిన్న ఓయూలో జరిగిన రిపోర్టర్ పై దాడిని ఖండిస్తూ.. గురువారం డిజిపి జితేందర్‌ను జర్నలిస్టులు కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఓయూ పోలీసులు జర్నలిస్ట్ శ్రీ చరణ్‌ను ఈడ్చుకెళ్ళిన వీడియోను డిజిపికి చూపించారు. డిజిపి జర్నలిస్టులకు సనుకులంగా స్పందించి హైదరాబాద్ సిపికి సిఫారసు చేశారు. జర్నలిస్ట్ పై దాడికి పాల్పడ్డ సిఐ రాజేందర్‌పై శాఖాపరమైన చేర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డీజీపీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీ తెలుగు న్యూస్ చీఫ్ ఎడిటర్ భారత్, క్రైమ్ రిపోర్టర్స్, tuwj (143), TJF, హైందవ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు

**- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచెన్నగారి లక్ష్మారెడ్డి**



**విశ్వంభర, బడంగ్‌పేట్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో మేలుని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న జ్యోతికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 1,50,000 ఎల్ఓసీని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు అయిన వెనకాడకుండా సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇది పేద ప్రజల ప్రభుత్వం అని అందరికీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ జ్యోతి తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటిన కార్పొరేటర్

**విశ్వంభర, కూకట్ పల్లి :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని వెంకటేష్ గౌడ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు మనమిచ్చే ఆస్తి స్వచ్ఛమైన పర్యావరణమే అని అన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యతను అధికారులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, భాస్కర్ రెడ్డి, జి.ఎచ్.ఎం.సి అధికారులు పాల్గొన్నారు.





## టీజీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నిర్మలా జగ్గారెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ కార్పోరేషన్ (టీజీఐఐసి) చైర్మన్ గా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్ రెడ్డి సతీమణి తూర్పు నిర్మల జగ్గారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బషీర్‌బాగ్ చౌరస్తాలోని పరిశ్రమల భవన్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్ తదితరులు హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ నాయకులూ కార్యకర్తలు జగ్గారెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమస్య ల పరిష్కారానికి కృషి

**- మాజీ ఎమ్మెల్యే కిచ్చేన్నగారి లక్ష్మా రెడ్డి**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం నియోజక వర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలల్లో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు కిచ్చేన్నగారి లక్ష్మా రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డిలు పర్యటించారు. శ్రీ రామ కృష్ణ పురం కాలనీ, హరిపురి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. వారు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం అయ్యే దిశగా ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, బండి మధుసూధన్ రావు, సురేంద్ర కుమార్, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, కాలనీల సంక్షేమ సంఘం, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర డీజీపీగా జితేందర్ నియామకం కావడంతో గురువారం డిజిపి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేసి శాలువ కప్పి హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు.

- విశ్వంభర, ఆత్మకూరు(ఎం)

## లయన్స్ క్లబ్ అభయ బంజారా 14వ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం



**విశ్వంభర, హైదరాబాద్ :** లయన్స్ క్లబ్ హైదరాబాద్ అభయ బంజారా 14వ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని లయన్స్ భవన్ సికింద్రాబాద్ ఆడిటోరియంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ సీనియర్ జిల్లా గవర్నర్ డా. ఎం రాజగోపాల్ రెడ్డి లయన్స్ సిద్ధాంతాల ప్రకారం ప్రమాణం చేయించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్రం మెడికల్ ఎడ్యుకేషన్ ఎడిషనల్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్ హాజరయ్యారు.

లయన్స్ జిల్లా నాయకులు, వివిధ సోదర క్లబ్ సీనియర్స్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ అధ్యక్షులు కె.శ్రీనివాసుల బృందం నుంచి 202425 సంవత్సరానికి గాను లయన్ బి.రాఘవేంద్ర, సీనియర్ అడ్వకేట్ అధ్యక్షుడు లయన్ జి.నరసింహారావు, సెక్రటరీ లైన్ ఏవీఎస్ రామారావు, ట్రెజరర్‌గా, సీనియర్ సభ్యులు లయన్ ఆదిరెడ్డి, కోటేశ్వరరావు, పి.ఎస్.ఎన్.రాజు, కె.శ్రీనివాసులు, లయన్ హైమాకుమారి , లయన్ పద్మజా రాణి, పవన్ కుమార్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ గా ప్రమాణం చేశారు.

ఇన్స్టాలేషన్ చైర్మన్‌గా లయన్ పి.ఎస్.ఎన్.రాజు స్వాగతోపన్యాసం చేశారు. క్లబ్ లోని సీనియర్స్ అందరినీ ఉచిత రీతిలో సన్మానం చేశారు. లయన్ సర్వేపల్లి గోపికృష్ణ, లయన్ ఇ.సూర్యనారాయణ మాస్టర్స్ ఆఫ్ సెరమనీగా వ్యవహరించారు.

లయన్ రాజశేఖర్ రెడ్డి ప్రముఖ సాంస్కృతిక కార్యక్రమాల పోషకులు కార్యక్రమానికి సంధాన కర్తగా వ్యవహరించారు. లయన్ సీహెచ్ సత్యనారాయణ, జిల్లా కేబినెట్ సెక్రటరీ, లయన్ చిన్నారెడ్డి, జిల్లా కేబినెట్ ట్రెజరర్, లయన్ ఎన్ మోహన్ దాస్, దేవేంద్ర బండారీ, లయన్ యాదయ్య గౌడ్, లయన్ లింగయ్య తదితరులు జిల్లా నుంచి హాజరయ్యారు. వారందర్ని నిర్వాహకులు తగిన రీతిలో సత్కరించారు.

## పర్మిట్ రూంలను బెల్ట్ షాపులను అరికట్టాలి

- తెలంగాణ బార్, రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్



**విశ్వంభర, బషీర్ బాగ్ :** రాష్ట్రంలో విచ్చలవిడిగా ఉన్న పర్మిట్ రూములను బెల్ట్ షాపులను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర బార్, రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్ డిమాండ్ చేశారు. కామరెడ్డి జిల్లా బాన్సువాడలో ఉన్న మదురాలయ బార్, రెస్టారెంట్లో బార్ యజమాని సుధాకర్ గౌడ్ ఉ. 9గం.లకు బార్ ను ఓపెన్ చేశారని ఒక వైన్ షాపు యజమాని మీద ఫిర్యాదు చేశారని, మీ బార్ పైన కేస్ నమోదు చేస్తానని బెదిరించడంతో ఆయన మనస్తాపానికి గురై ఆ బార్ నష్టాలలో ఉండి, కూడా అక్కడి నుండి మరొక చోటికి మార్చడం జరిగిందని ఆరోపించారు. నష్టాలలో వున్న కూడా నడుపుతున్నారని, చుట్టు ప్రక్కల ఉన్న వైన్ షాపులు దానికి ఈ పర్మిట్ రూం రూల్స్ కు విరుద్ధంగా, బెల్టు షాపులు వుండడం వలన తాను నష్టాలలో వున్నను, తన బార్‌ను రూల్స్ ప్రకారం ఓపెన్ చేయలేదని అంటున్నారని, కాబట్టి వైన్స్ షాప్ పర్మిట్ రూములు, బెల్ట్ షాపు విచ్చలవిడిగా వున్నాయన్నారు. కాబట్టి వాటిని నిర్మూలించాలని ఎక్సైజ్ సీఐ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటీ పర్మిట్ రూముల వలన ఆ బార్ యజమాని ఒక్కరే కాదు రాష్ట్రంలో ఉన్న అన్ని బార్ యాజమానులు నష్టాల్లో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ పి.రాజు గౌడ్, గౌరవ అధ్యక్షులు జి.విజయ కుమార్ గౌడ్, జనరల్ సెక్రటరీ ఎ.రామకృష్ణ, ట్రెజరర్ శ్రీదర్ రెడ్డి, ఎన్.మోహన్ గౌడ్, ఎ.అంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, రాజు గౌడ్, నరసింహా గౌడ్, వెంకన్న గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులు పల్లె నరసింహా రావు, తిరుపతయ్య గౌడ్, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

## కారోబార్ సమస్యలను పరిష్కరించాలి

**ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డికి వినతి**

**విశ్వంభర, నారాయణపూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కారోబార్ సమస్యలు పరిష్కరించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కరొబార్‌లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 51 ద్వారా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న వారందరూ కూలీ మల్టీ పర్పస్ వర్కర్లుగా పని చేయాలని రావడం వల్ల రికార్డు నిర్వహణ చేయవలసిన కరోబార్లను అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. పల్లె ప్రగతి కార్యక్రమాలు సహా అన్ని కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తూ గ్రామ అభివృద్ధి ప్రగతిలో నడిపించామన్నారు. వారి సేవలను గుర్తించి జీవితాలను వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్యాల చంద్రకాంత్, పొలగోని జంగయ్య, జంగిలి సుధాకర్, లోడ యాదయ్య, భాస్కర ఈశ్వర్, రమేష్, ప్రవీణ్, సురేష్, శంకర్ పాల్గొన్నారు.



# పడకేసిన పారిశుద్ధ్యం

- పట్టించుకోని అధికారులు
- సమీపిస్తున్న సీజనల్ వ్యాధుల కాలం
- కొన్ని గ్రామాల్లో ప్రబలుతున్న విష జ్వరాలు
- గ్రామాల్లో జాడకులేని స్పెషల్ ఆఫీసర్లు



**విశ్వంభర, చింతపల్లి :** రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల పదవీ కాలం ముగియడంతో చింతపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రభుత్వం వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులను ఆయా గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించింది. కాని స్పెషల్ ఆఫీసర్లు మాత్రం వారానికోసారి ఒక్క రోజైనా వారికి కేటాయించిన గ్రామ పంచాయతీలకు రావడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని దార్లో అలుకా జైహింద్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు పక్కన చెత్తా చెదారంతో పేరుకుపోయింది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు ఉపయోగించిన చెత్తచెదారంతో పాటు కుళ్ళిపోయిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చికెన్ వ్యర్థాలు, వివిధ రకాల ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులన్ని ఒకే చోట పడేయడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డుల మారి తీవ్రమైన దుర్వాసన వస్తుంది. వ్యర్థాలను తినేందుకు పందులు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ బాటసారులు పై దాడి చేస్తున్నాయి. ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే స్థానిక గ్రామస్తులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో ఈ చుట్టుపక్కలున్న నివాస గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో పెద్ద వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దుర్వాసనతో పాటు దోమలు మరింత వృద్ధి చెందే అవకాశం ఉందని గ్రామ ప్రజలు భయ పడుతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పేరుకుపోయిన పారిశుద్ధ్యన్ని వెంటనే తొలగించి, భవిష్యత్తులో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ముంచుకొస్తున్న ముప్పు..**

ఇప్పటికే నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకినట్లు వాతావరణ శాఖ నిపుణులు ప్రకటించారు. దీంతో మరో వారం రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వర్షాలు కురిస్తే మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా మారే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు అప్రమత్తంగాకుంటే ఆపదలు తప్పవంటున్నారు. వానాకాల సీజన్‌లో ప్రధానంగా మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు, డయేరియా లాంటి వ్యాధులు చుట్టుముట్టే అవకాశం ఉంది. మురికి నీటి కాల్వల పూడిక పనులను కూడా తక్షణమే చేపట్టాల్సి ఉంది. ఏదో ఉన్నతాధికారుల పర్యటనల సందర్భంగానే ప్రభుత్వ అధికారులు హడావుడి చేస్తున్న ఆ తర్వాత అంతా మాములుగానే మారిపోతుంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా స్పందించి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే తప్పా ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టలేరని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



## చండూరు మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భరోసా

**చండూర్, విశ్వంభర :** నల్గొండ జిల్లా చండూర్ మున్సిపాలిటీ కేంద్రంలో గత కొంతకాలంగా వేతనాలు సక్రమంగా అందడం లేదని జూలై 1 నుంచి చండూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనలు చేపట్టడం జరిగింది. నెలనెలా వేతనాలు రావడం లేదని పారిశుద్ధ్య కార్మికులు గత కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ దీక్ష చేపట్టారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం చండూర్ మున్సిపాలిటీలోని అతిథి గృహంలో పారిశుద్ధ్య కార్మికులను కలిసి వారి సమస్యలపై ఆరా తీశారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాల విషయంలో చండూరు మున్సిపల్ కమిషనర్, అధికారులతో చర్చించి మున్సిపాలిటీలో పనులను సమకూర్చుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల వేతనాలు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికులు అందరూ ఉండే వారికి పేలానిక ఇబ్బందులు కలగకుండా ప్రతి నెల జీతభత్యాలు సమయానికి అందించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. ఎమ్మెల్యే హామీతో పారిశుద్ధ్య కార్మికులు దీక్ష విరమించారు. వేతనాలపై భరోసా కల్పించడంతో పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దోటి వెంకటేష్, అనంత చంద్ర శేఖర్, మంచుకొండ సంజయ్, కోడి గిరిబాబు, పల్లె వెంకన్న, పున్న ధర్మేందర్, కారింగు రామ్మూర్తి, భూతరాజు వేణు, మల్లేశం, జనార్దన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేంద్ర మంత్రి బండి పుట్టినరోజు వేడుకలు

రక్తదానం, అన్నదానం చేసిన అభిమానులు



**విశ్వంభర, కరీంనగర్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఆయన అభిమానులు కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కార్యాలయం ఎదుట రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి కోసం 53 యూనిట్ల రక్తం శేకరించారు. ఈ శిబిరంలో మైనార్టీ మోర్చా నాయకులు పాల్గొని రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మైనార్టీ మోర్చా పక్షాన అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకులు మొహమ్మద్ ముజీబ్, మహమ్మద్ బషీరుద్దీన్, బల్వీర్ సింగ్, బిజెపి మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సమీపరవేస్, ఉపాధ్యక్షుడు మొహమ్మద్ సమీ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు షహజాద్ జాబీర్, సాబీర్, సయెద్ సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచాలి

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, భూపాలపల్లి :** చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో వేగం పెంచి రైతులకు అందుబాటులోకి తేవాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో చిన్న కాళేశ్వరం పనుల పురోగతిపై ఇరిగేషన్, విద్యుత్, రెవెన్యూ, మేఘ కంపనీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులలో వేగం పెంచాలని, వీరపూర్ చెరువు, మందిరం చెరువు ఆయకట్టు సర్వే పనులను ఆదివారం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. బీర సాగర్ పంపు హౌస్ లో పంపుల మరమ్మతులకు కావలసిన పరికరాలను తెప్పించి పనులు పూర్తి చేసి జూలై మాసం చివరి కల్ల నీటిని ఎత్తి పోయు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా నీరు రావడానికి ఇసుక తొలగింపునకు మైనింగ్ అధికారులను ఆదేశించారు. బీర సాగర్ పంప్ హౌస్ వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ పనులు పూర్తి అయ్యాయని, గారేపల్లి పంప్ హౌస్ వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌కు కావలసిన ట్రాన్స్ఫార్మర్స్, మెటీరియల్ తెప్పించి సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. రెండు పంప్ హౌస్‌ల అప్రోచ్ కెనాళ్లు, ప్రధాన కాల్వలు పూర్తిచేయాలని తెలిపారు. మల్హర్ మండలం రుద్రారం చెరువు కట్ట పనులు, గారేపల్లి పంప్ హౌస్ నుంచి ఆదివారం పేటచెరువు వరకు పైపులైను నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఈ సీజన్‌లో మొదటి విడత పనులు పూర్తి చేసి పంటలకు నీరందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హార్, ఆర్డీవో మంగిలాల్, ఇరిగేషన్ ఈ ఈ యాదగిరి, మహ దేవపూర్, కాటారం తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నాయవాదుల విధుల బహిష్కరణ



**విశ్వంభర, కరీంనగర్ :** రెండు రోజుల క్రితం సిద్దిపేట జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది రవి కుమార్‌పై సిద్దిపేట టూ టౌన్ పోలీసులు చేసిన దాడికి నిరసనగా గురువారం కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. భార్యభర్తల కేసులో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడానికి సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తన క్లయింట్‌ను తీసుకొని వెళ్లగా అక్కడ విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ హైకోర్టు ఉత్తర్వులను భేఖాతర్ చేస్తూ నోటికి వచ్చినట్లు భూతులు తిట్టగా అట్టి సంఘటనను న్యాయవాది తన మొబైల్‌లో చిత్రికరిస్తుండగా అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ న్యాయవాది రవి కుమార్‌పై చేయి వేసుకోవడన్ని తప్పు పడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయవాదికి మద్దతుగా నిలిచారు. సంబంధిత పోలీస్ అధికారిపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తిరుకోవెల రఘువీర్, సీనియర్ కార్యవర్గ సభ్యులు సుంకే దేవకిషన్, జూనియర్ కార్యవర్గ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, పస్తం ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు డి మల్లయ్య, రూపిరెడ్డి దేవేందర్ రెడ్డి, లక్ష్మణ్ రావు, అజయ్ చక్రవర్తి, బద్దం రామ్ రెడ్డి, శ్రీధర్ రావు, శ్రీనివాస్ కొత్త ప్రకాష్, స్వామి, విల్సన్, మునీష్, మహిళ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మో పులి..! ఉలిక్కిపడ్డ గ్రామస్తులు చివరికి నిజం తెలిసి షాక్

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలం హోమంతాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అనాజీపురం గ్రామంలో రెండు చిరుత పులి పిల్లలు కనిపించాయి అంటూ బుధవారం అదే గ్రామానికి చెందిన కొందరు ఆకతాయిలు వాట్సాప్ గ్రూపుల్లో, సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ చేశారు. అది నిజమే అనుకుని గ్రామస్తులు భయంతో బిక్కుబిక్కుమంటూ ఇండ్లలోనే కర్రలు పట్టుకొని రాత్రంతా జాగారాలు చేశారు. అనాజిపురం గ్రామంలో చిరుత పులి పిల్లలు కనిపించాయన్న సమాచారం తెలుసుకుని ఫారెస్ట్ బీట్ అధికారి ఉదయ్ కుమార్ గురువారం గ్రామంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అది చిరుత కాదు అడవి జంగ పిల్లి అని తేల్చేశారు. స్థానికులు ఎవరు కూడా భయభ్రాంతులకు గురి కావద్దని ఫారెస్ట్ అధికారులు సూచించారు. ఏదైనా కృర జంతువులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అది చిరుత పులి కాదు అడవి జంగ పిల్లి అని తెలియడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి



**విశ్వంభర, కరీంనగర్ :** గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి ఇందిరా మహిళా శక్తి ఉపయోగపడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇందిరా మహిళా శక్తిపై డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఇండస్ట్రీ అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలను అద్భుత పారిశ్రామిక వేత్తలుగా తీర్చిద్దాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి రూపకల్పన చేసిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు వ్యాపారాన్ని ప్రారంభించే ముందు మీ ద్వారా ఉత్పత్తి అయ్యే వస్తువుకు సంబంధించిన మార్కెటింగ్ మరియు వ్యాపారం గురించి సంపూర్ణ అవగాహనను పెంచుకొవాలన్నారు. కరీంనగర్ జిల్లాలో మొట్ట మొదటగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కొరకు మెప్మా, డిఆర్డిఓ, మహిళల సంఘాలు స్ట్రిచ్చింగ్ చేసి అందించడంలో విజయవంతం అయిందన్నారు. అదే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా సివిల్ పనులను మహిళా సంఘాల ద్వారా చేపట్టగా 85శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతీ మహిళా ఏదోఒక మైక్రో ఎంటర్ ప్రైజెస్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. పీఎంఈజీవై యం ద్వారా సబ్సిడి కూడా ఇప్పించినట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలన్ని ఒకే చోట ఒకే విధమైన వ్యాపారాలను నిర్వహించడం వంటివి కాకుండా అక్కడి మార్కెట్ పరిస్థితులకు అనుగునంగా వ్యాపారాలను ప్రారంభించుకోవాలన్నారు. వ్యాపారాన్ని సమిష్టిగా నిర్వహించడం మాత్రమే కాదు, వ్యాపార వృద్ధి కూడా సంపూర్ణ సహాయ సహకారాలతో ఎలాంటి అపోహాలకు తావు లేకుండా జరగాలని, అప్పుడే అద్భుతమైన విజయాలను చూడగలమన్నారు. మహిళా సంఘాలు వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కొటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఓ శ్రీనివాస్, ఎల్డియం ఆంజనేయులు, జీయం ఇండస్ట్రీస్ నవీన్ కుమార్, పశు సంవర్ధక శాఖ అధికారి పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య




**విశ్వంభర, కల్వకుర్తి/ఆమనగల్లు :** ఓయూలో నిరుద్యోగుల ఆందోళన కార్యక్రమంలో కవరేజీకి వెళ్లిన జీ తెలుగు జర్నలిస్ట్ పై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. జర్నలిస్టులు నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కి మెమోరాండం అందచేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో దాడి చేసిన పోలీసులపై సీఐకి ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తప్పవని హెచ్చరించారు.

## బాలికలకు షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన




**విశ్వంభర చివ్వేంల :** మహిళలు సమాజంలో ధైర్యంగా జీవించవచ్చని షీటీం ఎస్ఐ బీ ప్రవీణ్‌కుమార్, చివ్వేంల ఎస్సై రత్నం అన్నారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు చివ్వేంల మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సుమారు 200 మంది బాలికలకు జిల్లాలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆకతాయిల నుంచి మహిళలను, యువతులను రక్షించడంలో షీటీం ముందుంటుందన్నారు. సమాజంలో ధైర్యంగా జీవించేందుకు భరోసా ఇవ్వాలని, మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సత్వరమే స్పందించి చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా షీటీం బృందాలు నిఘా పెడుతూ మహిళలు సమాజంలో ధైర్యంగా జీవించవచ్చు అనే భరోసాను కల్పిస్తున్నామన్నారు. మహిళలపై అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడిన ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదేవిధంగా 100 నెంబర్‌కు ఫోన్ చెయ్యాలని, మహిళలకు భద్రత కల్పించేందుకు షీటీం బృందాలు జిల్లా వ్యాప్తంగా గట్టిగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఆకతాయిలు మహిళలను బాలికలను వేధింపులకు గురి చేసినట్లయితే నేరుగా షీటీం వాట్సాప్ నెంబర్ 8712686056కి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం ఏఎస్ఐ ఎల్.సాలయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎల్లారెడ్డి, భరోసా సెంటర్ నుంచి మౌనిక, కిరణమై, జడ్పీహెచ్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన గౌడ కంఠమ్ జాతీయ మాస పత్రిక ఎడిటర్ నోముల సిద్ధూ గౌడ్ బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నూతి శ్రీకాంత్‌ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు**

**- విశ్వంభర, ఆత్మకూరు(ఎం)**

## ప్రభుత్వ పాఠశాలలో నోటుబుక్స్ పంపిణీ



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని తుంబావి తండాలోని ప్రాథమిక పాఠశాలలోని ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి చదివే విద్యార్థుల కోసం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ సహకారంతో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు నోట్ బుక్స్, మహనీయుల చిత్రపటాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ప్రతి ఒక్క నిరుపేద విద్యార్థికి అందాలనే లక్ష్యంతో కస్తూరి ఫౌండేషన్ తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేపడుతూ వస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు వీరమల్ల కార్తీక్ గౌడ్, కొప్పు రామకృష్ణ, పల్చం శివ, ఎస్ఎంసి చైర్మన్ కేతావత్ బిక్కి, పంచాయతీ కార్యదర్శి వినయ్, ప్రధానోపాధ్యాయులు రామ్, ఉపాధ్యాయులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ ట్యాంక్ బండ్ అయ్యేనా..

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ పట్టణానికి సమీపంలో ఉన్న సురసముద్రం చెరువు ఆనకట్టను మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామని గత నాయకులు చెప్పి సగం పనులు చేసి అర్ధాంతరంగా ఆపేసి ఐదేళ్లు అవుతున్నా.. పట్టించుకునే నాథుడే లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా ఆమనగల్లు సురసముద్రం చెరువు కట్టను మినీ ట్యాంకుబండ్‌గా మారుస్తామని హామీ ఇచ్చిన ఏ ఒక్కరూ పనులు పూర్తి చేయడంలో సఫలం కాలేకపోయారు. ఆనకట్టపైన బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్, పార్క్, బోటింగ్, వంటివి ఏర్పాట్లు చేస్తామని చెప్పి సగం పనులు మాత్రమే చేశారు. ఆమనగల్లు బస్టాండ్‌కి అతి దగ్గరలో ఉన్న సురసముద్రం చెరువు ఆనకట్ట వర్షాకాలం వస్తే చెరువు నిండి జాలు పారుతుంది, ఆనకట్ట కింద బీసీ కాలనీ ఉంది. కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి, వర్షాలు ఎక్కువగా పడితే చెరువు కట్ట పగులు వచ్చి తెగుతుందేమో అని భయపడి కాలనీ వాసులు బస్టాండ్‌లో పడుకున్న సందర్భాలు ఉన్నాయి. అప్పటి నుంచి ఇప్పటిదాకా మూడేళ్లు గడిచిన ఎవరు పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు అధికారులు చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలని ఆమనగల్లు చిరకాల కోరిక తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



## నూతన రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి

**విశ్వంభర, నారాయణపూర్ :** నారాయణపురం మండలం అల్లందేవిచెరువు గ్రామపంచాయతీ పరిధిలో సిపిఐఎం పార్టీ ఆధ్వర్యంలో సిపిఎం పోరుబాట కార్యక్రమంతో, గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనూరి నర్సిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. అల్లందేవిచెరువు గ్రామపంచాయతీ ఏర్పడి, ఏడు సంవత్సరాలు అవుతున్నా.. ఇప్పటికీ గ్రామంలో రేషన్ షాప్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వృద్ధులు, వికలాంగులు సామాన్య ప్రజలు కూడా బియ్యం తీసుకొని వచ్చేటప్పుడు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కావున అల్లందేవి చెరువు గ్రామపంచాయతీ కి ఒక రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తానని వాగ్దానం చేసింది. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఉప్పలపేల్లి బాలకృష్ణ, అల్లందేవిచెరువు గ్రామ శాఖ కార్యదర్శిలు గంగాదేవి భిక్షపతి, గుండు లింగస్వామి, సీనియర్ నాయకులు బద్ధం జగాల్ రెడ్డి, జెనిగల యాదయ్య, ఉప్పల పెల్లి సైదులు, డివైఎఫ్ఐ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

## కల్వకుర్తి ఎమ్మెల్యేకు బీజేపీ నాయకుల వినతి

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లులో ప్రభుత్వ వైద్యశాల ప్రారంభానికి బుధవారం వచ్చిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి బిజెపి నాయకులు విడి విడిగా వినతి పత్రాలు అందజేశారు. నాలుగు సంవత్సరాల కింద ఆమనగల్లులో సొంత భవనం లేక గురుకుల పాఠశాలను తరలించి షాద్నగర్ మండలంలో కొనసాగిస్తున్నారు. సొంత భవనాన్ని నిర్మించి ఆమనగల్లుకు గురుకుల పాఠశాలను తీసుకురావాలని బీజేవైఎం సీనియర్ నాయకులు రేవల్లి రాజు వినతి పత్రం అందజేశారు. కాగా తలకొండపల్లికి చెందిన పోతుగంటి మహేష్ మండలంలో బీటీ రోడ్లు నిర్మించాలని, కాలేజీకి సొంత భవనం నిర్మించాలని, రోడ్డు విస్తరణ పనులు తొందరగా చేపట్టాలని మరో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడవల్లి మహేష్, రేవల్లి వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ చెంపలు వాయించాలన్న
# బీజేపీ ఎమ్మెల్యేపై కేసు

- పార్లమెంటులో రాహుల్ శివుడి ఫొటో ప్రదర్శించడంపై భరత్‌శెట్టి వివాదాస్పద వ్యాఖ్యలు
- హిందువులను హింసావాదులుగా ముద్ర వేస్తున్నారని మండిపాటు
- చెంపదెబ్బలకు రాహుల్ అర్హుడేనని వ్యాఖ్య
- కాంగ్రెస్ నేత ఫిర్యాదుపై మంగళూరులో కేసు నమోదు



**విశ్వంభర, బెంగళూరు :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కర్ణాటకలోని మంగళూరు నార్త్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే వై.భరత్‌శెట్టిపై కేసు నమోదైంది. మంగళూరు సిటీ కార్పొరేషన్ సభ్యుడు అనిల్‌కుమార్ ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పార్లమెంటులో శివుడి ఫొటోను ప్రదర్శించిన రాహుల్‌గాంధీ చెంపలు పగలగొట్టాలంటూ భరత్‌శెట్టి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శివుడి మూడో కన్నును రాహుల్ విస్మరిస్తున్నారని, అది ఎవరినైనా బూడిదగా మార్చేస్తుందని పేర్కొన్నారు. హిందువులను హింసావాదులుగా ముద్రవేస్తున్న రాహుల్ చెంపదెబ్బకు అర్హుడేనంటూ వివాదాదస్పద వ్యాఖ్యలు చేశారు. భరత్ వ్యాఖ్యలపై వివాదం రాజుకుంది. కాంగ్రెస్ నాయకులు నిరసనలకు దిగారు. భరత్‌శెట్టికి నిజంగానే అంత ధైర్యం ఉంటే కనీసం తమ కార్యకర్తపైన అయినా చెయ్యెత్తాలని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి బి.రామనాథ రాయ్ సవాలు విసిరారు. కాగా, అనిల్ కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మంగళూరు డీసీపీ సిద్ధార్థ్ గోయల్ తెలిపారు.




## నీట్ పేపర్ లీకేజీ కేసులో
# మరో కీలక సూత్రధారి

### అదుపులోకి తీసుకున్న సీబీఐ

**విశ్వంభర, పాట్నా :** నీట్ పేపర్ లీకేజీ, గ్రేస్ మార్కుల కేటాయింపు దేశంలో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీంతో ఈ కేసును కేంద్రము సీబీఐకి అప్పగించింది.రంగంలోకి దిగిన సీబీఐ ఈ కేసులో కీలక సూత్రధారిని ఇవాళ అరెస్టు చేసింది. బిహార్‌లోని నలందకు చెందిన రాకీ అలియాస్ రాకేష్ రంజన్‌ను పాట్నా నగర శివార్లలో అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న సంజీవ్ ముఖియా బంధువు ఈ రాకేష్ రంజన్ అని సిబిఐ గుర్తించారు. అరెస్టు చేసిన వెంటనే అతడిని పాట్నాలోని ప్రత్యేక కోర్టు ఎదుట హాజరుపర్చగా, 10 రోజుల సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వారం ప్రారంభంలో జారండ్, బిహార్, బెంగాల్‌లోని పలుచోట్ల సిబిఐ సోదాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలు కీలక సాక్ష్యాలను సేకరించింది. వాటి ఆధారంగానే రాకీని అరెస్టు చేసినట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటివరకు సీబీఐ 6 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. బిహార్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పేపర్ లీక్‌లకు సంబంధించినది. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలలో అభ్యర్థులను మోసగించడంతో ముడిపడి ఉన్నవి.

## డేట్ మార్చి.. యూజీసీ
## నెట్ పేపర్ స్క్రీన్‌షాట్ వైరల్ : సీబీఐ

**విశ్వంభర, ఢిల్లీ:** యూజీసీ నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆ ప్రశ్నపత్రం వక్రీకరించిన స్క్రీన్ షాట్‌ను షేర్ చేసిన ఓ విద్యార్థిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ స్క్రీన్‌షాట్ ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో కేంద్ర విద్యాశాఖ పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. లీకైన ఆ క్వశ్చన్ పేపర్ వక్రీకరించినదని, ఆ స్క్రీన్‌షాట్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టడం వెనక ఒక పాఠశాల విద్యార్థి ఉన్నారని అధికారులు గుర్తించారు. ఒక యాప్ ద్వారా ఇదంతా చేశాడని తెలిపారు. దానిపై డేట్‌ను జూన్ 17గా మార్చి.. తనవద్ద తర్వాత పరీక్ష ప్రశ్నపత్రం కూడా ఉందని నమ్మించి, కొంత డబ్బు సంపాదించేందుకే దాన్ని వైరల్ చేసినట్లు వెల్లడించారు. అది మార్పులు చేసిన పేపర్ అని ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించినట్లు తెలిపారు. ఆ విద్యార్థిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత కోసం జూన్ 18న దేశవ్యాప్తంగా యూజీసీ నెట్ పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించిన విషయం తెలిసిందే.

## 'నీట్ పరీక్షలో మాల్ ప్రాక్టీస్ జరగలేదు'..

### సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

**విశ్వంభర, ఢిల్లీ:** గత కొంతకాలంగా నీట్ పరీక్షలో అవకతవకలపై దేశవ్యాప్తంగా దుమారం రేగిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ చేరింది. ఈ నేపథ్యంలో నీట్ (యూజీ)లో మాల్ ప్రాక్టీస్ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ పరీక్షలో మాల్ ప్రాక్టీస్ జరిగిందనడానికిగానీ, కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు లబ్ధి పొందేలా అక్రమాలు జరిగాయనడానికిగానీ ఆధారాల్లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మద్రాస్ ఐఐటీ నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాల డేటా విశ్లేషణలో మార్కుల పంపిణీలో అసాధారణ అంశాలేవీ కనిపించలేదని తెలిపింది. మార్కులు సాధారణంగానే ఉన్నాయని సుప్రీంకోర్టుకు సమర్పించిన అదనపు అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొంది. నీట్ (యూజీ)పై ఇవాళ సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ అఫిడవిట్ సమర్పించింది. 2024-25 సంవత్సరానికిగానూ అండర్ గ్రాడ్యుయేట్ సీట్లకు సంబంధించిన కౌన్సిలింగ్ ప్రక్రియ, జులై మూడో వారం నుంచి నాలుగు రౌండ్లలో నిర్వహించనున్నట్లు అదనపు అఫిడవిట్‌లో కేంద్రం వెల్లడించింది.

# కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని మోదీ సమీక్ష

- ఈనెల 23న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- ఆర్థికవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో మోదీ భేటీ



**విశ్వంభర, ఢిల్లీ :** కేంద్ర బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో మోదీ భేటీ అయ్యారు. సమావేశానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సైతం హాజరయ్యారు. ఈ నెల 23న కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ సాధారణ బడ్జెట్‌లో పరిశ్రమలతో పాటు మధ్య తరగతి, దిగువ తరగతి ప్రజలపై భారీ ఆశలు పెట్టుకున్నారు. పెట్టుబడులను రాబట్టేందుకు కేంద్రం ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాలని భావిస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మోదీ 3.0 ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేయనుందని చెప్పారు. పెట్టుబడులు రాబట్టడం ద్వారా వృద్ధిరేటు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం వ్యూహం సిద్ధం చేస్తోంది. అయితే, ఏ రంగంలో ఏ స్థాయిలో సంస్కరణలు అవసరమో ఆయా రంగాల నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. 2047 నాటికి మోదీ సర్కార్ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. సాధారణ బడ్జెట్ ద్వారా అభివృద్ధి చెందిన భారత దేశానికి ప్రభుత్వం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా మౌలిక సదుపాయాల రంగంలో ప్రత్యేక కృషి అవసరమని భావించారు. ఆర్థికవేత్తలతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు సైతం పేద, మధ్య దిగువ మధ్యతరగతి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను, గృహ రుణాల విషయంలో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు ఊరట కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పేదల కోసం కొత్త పథకాన్ని ప్రారంభించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది.



## విశాఖ స్టీల్ ప్లాంట్
# మూత పడే ప్రసక్తే లేదు

- విజిటర్స్ బుక్‌లో స్పష్టంగా ఆ విషయం నమోదు
- ఉక్కు ప్రైవేటీకరణ జరుగుతుందని ఎవరు చెప్పారు
- ప్రధాని ఆశీస్సులతో మళ్ళీ ప్లాంట్ పునరుద్ధరణ
- కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి పరిశీలించిన కేంద్ర మంత్రి

**విశ్వంభర, విశాఖపట్నం:** రెండు రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్‌పై హడావుడి జరుగుతోంది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ నేతలు ఇటీవల కేంద్ర ఉక్కు మంత్రి హెచ్ డీ కుమారస్వామిని ఢిల్లీ లో కలిసి స్టీల్ ప్లాంట్ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. పెట్టుబడుల ఉపసంహరణ నుంచి ఆర్ఎన్ఐఎల్‌ను బయటకు తెచ్చి నష్టాల ఊబి నుంచి బయటపడడానికి ప్రత్యామ్నాయాలు వెతకాలని సూచించారు. వెంటనే స్పందించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి విశాఖకు రావడంతో ఏదో సానుకూల నిర్ణయం జరుగుతున్నట్లుగా అందరూ భావించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం అవుతుందని ఆందోళన చెందుతున్న నేపథ్యంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి విశాఖ పర్యటనపై కార్మికుల్లో ఆశలు చిగురించాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ మూత పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. విజిటర్స్ బుక్‌లో స్పష్టంగా ఆ విషయం నమోదు చేశారు. ఉక్కు ప్రైవేటీకరణ జరుగుతుందని ఎవరు చెప్పారని ఎదురు ప్రశ్నించారు. తాను ప్రధానికి నోట్ సమర్పిస్తానని.. ప్రధాని ఆశీస్సులతో మళ్ళీ ప్లాంట్ పునరుద్ధరణ జరుగుతుందని అన్నారు. అయితే కుమార స్వామి రాకపై ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ కొంత హింట్ ఇవ్వడంతో అనిశ్చితి తొలగింది. కానీ ఏకంగా కేంద్ర ఉక్కు మంత్రినే ప్లాంట్‌లో ఉండడంతో ఏం జరుగుతుందో అన్న చర్చ పెద్ద ఎత్తున జరిగింది. శ్రీనివాస్ వర్మ చెప్పిన దాని ప్రకారం కేంద్ర ఉక్కు మంత్రి పర్యటనలో అద్భుతాలు ఏమీ జరగవని, పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం ప్రధాని అధ్యక్షతన కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్లాంట్ స్థితిగతులను నేరుగా తెలుసుకునేందుకే వస్తున్నామని చెప్పుకొచ్చారు శ్రీనివాస వర్మ. దీంతో నిన్నటికే ఆ అనిశ్చితి తొలగింది. రెండు రోజుల విశాఖ టూర్‌లో భాగంగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి గురువారం ఉదయం స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించారు. ప్లాంట్‌లోని కోక్ ఓవెన్‌బీ ఈడీ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఎస్ఎంఎస్2, వైర్ రాడ్ మిల్ విభాగాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఉత్పత్తిని అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటకు పైగా ప్లాంట్‌లోనే తిరిగారు. మంత్రి కుమారస్వామి. ఆ తర్వాత అడ్మిన్ బిల్డింగ్‌కు వెళ్లి విశాఖ ఉక్కు సీఎండీ అతుల్ భట్, ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. ప్లాంట్ నమూనాను పూర్తిగా పరిశీలించారు. దాదాపు నాలుగు గంటలకు పైగా స్టీల్ ప్లాంట్ సందర్శనలోనే గడిపారు మంత్రి కుమారస్వామి. ఆ తర్వాత కార్మిక సంఘాల నాయకులతో మంత్రి కుమారస్వామి సమావేశమయ్యారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక నేతలు మంత్రిని కోరారు. అవసరమైతే ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా.. సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. అందరి వినతులు విన్నాక మంత్రి మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశాభివృద్ధికి సాయపడుతున్నదన్న సంగతి అర్థమైందన్నారు. స్టీల్ ప్లాంట్ అధ్యయనం కోసమే తాను వచ్చానన్నారు. ఇక్కడి పరిస్థితిని ప్రధానికి వివరిస్తానని వెల్లడించారు. స్థానికుల సెంటిమెంట్, కార్మికుల జీవనోపాధి తనకు బాగా అర్థమైనదని మంత్రి చెప్పారు. ఈ ప్లాంట్‌ను పరిరక్షించడమే బాధ్యతగా ముందుకు వెళతామన్నారు. ప్రధాని ఆశీస్సులతో స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం పునరుద్ధరించే అవకాశమున్నదని చెప్పారు. అన్నింటికంటే అతి ముఖ్యంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ప్రైవేటీకరిస్తారని మీకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి పర్యటనతో స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సానుకూల పరిస్థితి ఏర్పడిందన్నారు టీడీపీ ఏపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. ఎంపీలు కలిసిన 14 రోజుల్లోనే కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖకు వచ్చారని, అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పిన మంత్రిని ఆర్థిక భారం లేకుండా చూడాలని కోరినట్టు పల్లా తెలిపారు. బ్యాంకర్లు లోన్లు ఇవ్వాలంటే కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములను ఆర్ఐఎన్ఎల్ పేరుపై మార్చాలని, లేదంటే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలనీ, అదీ కుదరకపోతే సెయిల్‌లో విలీనం చేయాలని కోరామన్నారు పల్లా శ్రీనివాసరావు. స్టీల్‌ప్లాంట్‌పై మేనిఫెస్టోలో చెప్పినట్టే జరుగుతుందన్నారు.



## ఉచిత రేషన్ పథకం నిరంతరం కొనసాగుతుంది
### కేంద్ర మంత్రి పహ్లాద్ జోషి

**విశ్వంభర, ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన నిరంతరం కొనసాగుతుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ద్వారా ప్రతి ఇంటికి 5 కిలో ధాన్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా 80 కోట్ల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద రేషన్ కార్డ్ హోల్డర్‌కు 5 కిలోల ఉచిత రేషన్ కేటాయింపును వచ్చే ఐదేళ్లపాటు కొనసాగుతుందన్నారు. ఏప్రిల్ 2020లో ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం కారణంగా, కేంద్ర ప్రభుత్వం PMGKAYని ప్రతి రేషన్ కార్డ్ హోల్డర్‌కు అదనంగా 5 కిలోల ఆహార ధాన్యాలను సబ్సిడీ ధరలకు అందించింది. రేషన్ కార్డ్ హోల్డర్లకు 5 కిలోల ఆహార ధాన్యాలను అందించాలని మోదీ సర్కార్ నిర్ణయించింది. ఏప్రిల్ 2020 నుండి రేషన్ కార్డ్ హోల్డర్‌లు ఒక్కొక్కరికి 10 కిలోల రేషన్ అందిస్తూ వస్తోంది. NFSA కింద సబ్సిడీ ధరపై 5 కిలోలు, PMGKAY కింద 5 కిలోలు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇక ఆ తర్వాత 2022 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నగా మార్చింది. ఈ పథకం కింద ప్రతి రేషన్ కార్డ్ హోల్డర్‌కు 5 కిలోల రేషన్ ఉచితంగా అందిస్తోంది. మోదీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం కారణంగా 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడగలిగారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు.



## మహారాష్ట్ర అసెంబ్లీలో
# అర్బన్ నక్సలిజం బిల్లు

**విశ్వంభర, గుజరాత్ :** అర్బన్ నక్సలిజం'ను అరికట్టేందుకు "మహారాష్ట్ర ప్రత్యేక ప్రజా భద్రతా బిల్లు-2024"ను మహారాష్ట్ర ప్రభుత్వం ఇవాళ అసెంబ్లీలో ప్రవేశపెట్టింది.వ్యక్తులు, 48 నిషేధిత సంస్థల చట్టవిరుధ కార్యకలాపాలను నిరోధించేందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్,ఒడిశా రాష్ట్రాలు ఆమోదించిన ప్రజా భద్రతా చట్టం తరహాలో ఈ బిల్లును రూపొందించారు. దీన్ని మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మావోయిస్టుల ముప్పును ఎదుర్కోవడానికి ప్రస్తుత చట్టాలు సరిపోవు కాబట్టే.. మావోయిజానికి సహకరించే సంస్థలు, వ్యక్తుల కార్యకలాపాలను అడ్డుకునేందుకు కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలోని చాలా నగరాల్లో మావోయిస్టులకు సురక్షిత స్థావరాలు ఉన్నాయని సమంత్ అన్నారు .మావోయిస్టులను ప్రోత్సహించే ఏ సంస్థను కూడా ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలిపారు. నిషేధానికి గురయ్యే సంస్థల కార్యకలాపాలలో పాల్గొనే లేదా సహకరించే వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.3 లక్షల వరకు జరిమానా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు అని వెల్లడించారు.



## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల..

- సెక్రటేరియట్ రెండో బ్లాక్ లోని ఛాంబర్ లో బాధ్యతల స్వీకరణ
- రూ. 250 కోట్లను స్థానిక సంస్థలకు విడుదల చేస్తూ తొలి సంతకం
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే తన ప్రధాన బాధ్యత అన్న పయ్యావుల

**విశ్వంభర, మంగళగిరి :** ఏపీ ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాల మంత్రిగా పయ్యావుల కేశవ్ ఈరోజు బాధ్యతలను స్వీకరించారు. సెక్రటేరియట్ లోని రెండో బ్లాక్ లో ఉన్న తన ఛాంబర్‌లోకి ప్రవేశించి, వేద పండితుల ఆశీర్వ చనాల మధ్య బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక మంత్రిగా తన తొలి సంతకాన్ని 15వ ఆర్థిక సంఘం నిధుల ఫైల్ పై చేశారు. రూ. 250 కోట్ల ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, జానకి, వినయ్ చంద్, స్టేట్ ట్యాక్సెస్ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్, ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ కె.ఆదినారాయణ, ట్రెజరీస్ డైరెక్టర్ మోహన్ రావుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం తన ప్రధాన బాధ్యత అని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత కారణంగా 16 పథకాలను కేంద్ర ప్రభుత్వం ఆపేసిందని... ఆ పథకాలన్నీ 60 శాతం రాష్ట్రం, 40 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు పెట్టేవని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా వాడుకోలేని దారుణ స్థితి వైసీపీ హయాంలో ఉందని విమర్శించారు. జగన్ కు ఎవరు సలహాలు ఇచ్చారో కూడా తెలియడం లేదని అన్నారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ గాడి తప్పాయని వ్యాఖ్యానించారు.

## వైసీపీ మోసం చేసిందంటూ కంటతడి పెట్టిన మాజీ ఎమ్మెల్యే

- కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డిని సస్పెండ్ చేసిన వైసీపీ అధిష్ఠానం
- ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పని చేస్తే సస్పెండ్ చేశారని సిద్ధారెడ్డి మండిపాటు
- నేటి నుంచి కొత్త రాజకీయం చూపిస్తానని వ్యాఖ్య



**విశ్వంభర, కదిరి :** తనను వైసీపీ అధిష్ఠానం మోసం చేసిందంటూ కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి కంటతడి పెట్టుకున్నారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పని చేస్తే సస్పెండ్ చేస్తారా? అని మండిపడ్డారు. తాను పార్టీకి ఎలాంటి మోసం చేయలేదని చెప్పిన ఆయన... తనకు ఎలాంటి నోటీస్ ఇవ్వకుండానే, తన నుంచి వివరణ తీసుకోకుండానే సస్పెండ్ చేశారని అన్నారు. 2014లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన చాంద్ బాషా పార్టీ ఫిరాయించారని... అయినప్పటికీ పదేళ్లుగా తాను పార్టీని బలోపేతం చేశానని చెప్పారు. ఒక్కో ఇటుక పేర్చుతూ పార్టీని బలోపేతం చేశానని తెలిపారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దారుణమని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగానే మరో వ్యక్తిని ఇన్ఛార్జ్‌గా తీసుకొచ్చి తనను అవమానించారని సిద్ధారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఫోన్ చేస్తే స్పందించొద్దని అధికారులను కట్టడి చేశారని మండిపడ్డారు. కొంతమంది డబ్బులు, పదవుల కోసం పార్టీని నాశనం చేశారని చెప్పారు. జగన్ తనకు నేరుగా చెప్పి ఉంటే... తానే తప్పుకునే వాడినని అన్నారు. నేటి నుంచి తన కొత్త రాజకీయం చూస్తారని సిద్ధారెడ్డి చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనే విషయంపై తన సన్నిహితులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటానని అన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కదిరి టికెట్ ను సిద్ధారెడ్డికి కాకుండా... మక్బూల్ అహ్మద్ కు ఇచ్చారు. మక్బూల్ పై టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్ గెలుపొందారు. కాగా, ఆ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేశారనే ఆరోపణలతో సిద్ధారెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది ఐఏఎస్‌ల బదిలీ

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది ఐఏఎస్‌లను, ఇద్దరు ఐపీఎస్ అధికారు లను బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జి.అనంతరాము, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శిగా ఆర్పీ సిసోడియా, సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్‌గా జి.జయలక్ష్మి, ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కార్యదర్శిగా సురేశ్ కుమార్‌లను బదిలీ చేశారు. సురేశ్ కుమార్‌కు గ్రామ వార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. జీఏడీ కార్యదర్శిగా కూడా సురేశ్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఐటీ శాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా సౌరభ్ గౌర్, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శిగా యువరాజ్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా హర్షవర్ధన్, వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యదర్శిగా పి.భాస్కర్‌లను బదిలీ చేశారు. పి.భాస్కర్‌కు ఈడబ్ల్యుఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలను అప్పగించారు. సాంఘిక సంక్షేమ కార్యదర్శిగా కె.కన్నబాబును బదిలీ చేశారు. ఆయనకు గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గాను బాధ్యతలు అప్పగించారు. వినయ్ చంద్‌ను పర్యాటక శాఖ కార్యదర్శిగా, వివేక్ యాదవ్‌ను యువజన సర్వీసులు, క్రీడల శాఖ కార్యదర్శిగా, సూర్యకుమారిని మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా, సి.శ్రీధర్‌ను ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. జె.నివాస్‌కు ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శిగా, విజయరామరాజుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా, ఢిల్లీరావుకు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హిమాంశు శుక్లాకు సమాచార, పౌరసంబంధాల శాఖ బాధ్యతలను అప్పగించారు. వ్యవసాయ శాఖ నుంచి హరికిరణ్‌ను బదిలీ చేశారు. గిరిజా శంకర్‌ను ఆర్థిక శాఖ నుంచి రిలీవ్ చేశారు.

# ఏపీలో సుదీర్ఘ తీర ప్రాంతం... అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయి

- రాష్ట్రంలో నైపుణ్య గణనపై దృష్టి సారించాం
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలు అందిపుచ్చుకునేందుకే స్కిల్ సెన్సెస్
- తయారీ రంగానికి ఏపీ వ్యూహాత్మక ప్రాంతం
- ఫార్మా, ఆటోమొబైల్, హార్డ్ వేర్, ఆగ్రో రంగాల్లో విస్తృత అవకాశాలు
- సీఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు



**విశ్వంభర, విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ తీర ప్రాంతం ఉందని... మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని... అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం విశాఖలో నిర్వహించిన సీఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నైపుణ్య గణనపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకే స్కిల్ సెన్సెస్ ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందేలా చూస్తామన్నారు. తయారీ రంగానికి ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక ప్రాంతమన్నారు. విశాఖపట్నంను ఫిన్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ రంగంలో ఏపీలో ఎన్నో అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. ఫార్మా, ఆటోమొబైల్, హార్డ్ వేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

### 2026 నాటికి భోగాపురం పూర్తి చేస్తాం...

2026 నాటికి భోగాపురం విమానాశ్రయం తొలిదశను పూర్తి చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ఎయిర్ పోర్ట్ పూర్తయితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. దీనిని పూర్తి చేయించే బాధ్యత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుపై ఉందన్నారు. హెలికాప్టర్ ద్వారా విమానాశ్రయం ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం కీలకమన్నారు. ఈ ప్రాంతానికి భోగాపురం గ్రోత్ ఇంజిన్‌గా పని చేస్తుందన్నారు. విమానాశ్రయం పూర్తయితే ఈ ప్రాంతం ఎకనమిక్ హబ్‌గా మారుతుందన్నారు. చుట్టుపక్కల ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. భోగాపురం వరకు బీచ్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఎదగడానికి భోగాపురంకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి రోడ్ల కనెక్టివిటీని పెంచాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఎన్నో అంశాలు మళ్లీ మొదటికి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే ప్రారంభంలోనే 48 లక్షల మంది ప్రయాణికులతో రన్ అయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు. భోగాపురం విమానాశ్రయానికి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అనుమతులు వచ్చాయన్నారు. అప్పుడు ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఉత్తరాంధ్ర అద్భుత విజయాన్ని అందించిందని... ఇలాంటి ప్రాంతానికి ఏదైనా చేయాలన్నారు. అందువల్లే జిల్లా పర్యటనలలో భాగంగా తొలుత ఉత్తరాంధ్రకే వచ్చానన్నారు. విశాఖపట్నం – విజయనగరం కలిసిపోతున్నాయన్నారు. భవిష్యత్తులో విశాఖ, శ్రీకాకుళం కూడా కలిసిపోతాయన్నారు. విశాఖపట్నానికి మెట్రో రావాల్సి ఉందన్నారు. ముమ్మందు కుప్పం సహా ఐదు విమానాశ్రయాలు వస్తాయన్నారు.

# ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తైతే ప్రతి ఎకరాకు సాగునీరు

- టెండర్లు పిలిచి త్వరలోనే పోలవరం ఎడమ కాల్వ పనులు ప్రారంభం
- రూ.800 కోట్లతో మొదటి దశ పనులు చేపట్టి 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు
- కృష్ణా-గోదావరి-పెన్నా-వంశధార నదులను అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు ఉండదు
- అనకాపల్లి జిల్లా దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాల్వను పరిశీలించిన సీఎం



**విశ్వంభర పాయకరావుపేట/దార్లపూడి:** ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తైతే ఉత్తరాంధ్రలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించవచ్చని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సుజల స్రవంతిని పూర్తి చేస్తే ఉత్తరాంధ్ర ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. సుజల స్రవంతి పనుల్లో టీడీపీ హయాంలో చేసిన పనులు తప్ప గత ప్రభుత్వంలో ఒక్క ముందడుగు పడలేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, ఒక్క ఇంచు కూడా పని ముందుకు కదల్లేదన్నారు. ఐదేళ్లలో ఎక్కడైనా తట్ట మట్టి వేశారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఉత్తరాంధ్రలో చంద్రబాబు నాయుడు పర్యటించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం దార్లపూడి వద్ద గురువారం పోలవరం ఎడమ కాల్వను పరిశీలించారు. అంతకుముందు కాల్వ పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### ప్రజల రుణం తీర్చుకునే బాధ్యత నాపై ఉంది

'ఓట్లు వేసి గెలిపించిన వారి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. భగవంతుడు నాకు ఇచ్చిన శక్తినంతా ఉపయోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా. ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశాం. పోలవరంను 72 శాతం నేను పూర్తి చేశాను. ఒక దుర్మార్గుడు వచ్చి డయాఫ్రం వాల్ ను గోదావరిలో కలిపేశారు. కాఫర్ డ్యామ్ లు డ్యామేజ్ అయ్యాయి. 2021 జూన్ కు నీళ్లు రావాల్సి ఉండగా నిర్వీర్యం చేశారు. పోలవరం రాష్ట్రానికి వరం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి పోలవరం ద్వారా గోదావరి నీళ్లు తీసుకొస్తే ప్రతి ఎకరాకు నీరు అందించొచ్చు.. కరువు అనే సమస్య ఉండదు. అండర్ పాస్ లకు కూడా టెండర్లు పిలిచి త్వరితగతిన పూర్తి చేస్తాం.' అని సీఎం తెలిపారు.

### నదుల అనుసంధానంతో కరవు నివారణ

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతిలో కుడి కాలువ 214 కి.మీ పూర్తి కావాల్సి ఉంది. మొదటి విడతగా కాలువను 93 కి.మీ పూర్తి చేయడానికి రూ.800 కోట్లు ఖర్చు అవుతుంది. దీంతో లక్ష ఎకరాలకు అనకాపల్లి పరిధిలో నీరందించవచ్చు. ఇప్పుడే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. యాక్షన్ ప్లాన్ తయారు చేశాక మరింత వేగవంతంగా పనులు పూర్తి చేస్తాం. ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పోలవరం కుడి కాల్వ ద్వారా సాగునీరు అందించవచ్చు. 23 టీఎంసీల నీళ్లతో అనకాపల్లి జిల్లాలో ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరందించవచ్చు. రూ.800 కోట్లు ఖర్చు చేసి 93వ కి.మీ వరకు 2.20 లక్షల ఎకరాలకు నీరందించేందుకు మొదటి విడతలో పనులు పూర్తి చేస్తాం. ఈ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంశధార నది దాకా వెళ్తుంది. వంశధార–గోదావరి–కృష్ణా–పెన్నా నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు లేకుండా చేస్తాం." అని సీఎం స్పష్టం చేశారు

### 3 షుగర్ ఫ్యాక్టరీలు మూత

"ఈ ప్రాంతంలోని షుగర్ ఫ్యాకర్టీ రైతులకు కూడా హామీ ఇస్తున్నా.. గత అసమర్థ ప్రభుత్వం కారణంగా 3 షుగర్ ఫ్యాక్టరీలు పడకేశాయి. ఇక్కడి రైతులకు కూడా న్యాయం జరగాలి.. వారి భాగస్వామ్యంతోనే ఫ్యాక్టరీలు నడవాలి. రైతులకు న్యాయం చేస్తాం. శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తాం. నేను కష్టపడతాను.. సంపద సృష్టించి ఆదాయం పెంచి పేదలకు పంచుతాం. మీకు వెసులుబాటు ఇవ్వాల్సిన బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై ఉంది. దేశంలో ఎక్కడా ఇవ్వని విజయాన్ని ఏపీ ప్రజలు ఎన్డీయేకు ఇచ్చారు. ఇది చారిత్రక విజయం. 95 వేల మెజారిటీతో అభ్యర్థులను గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడం మా బాధ్యత. దొంగ మాటలు చెప్పేవాళ్ల మాటలు నమ్మి బజారులో తిరగనిస్తే బతుకులు ఏమవుతాయో ఆలోచించాలి." అని సీఎం పిలుపునిచ్చారు

### విశాఖ స్టీల్ ప్లాంట్ పై తప్పుడు ప్రచారం

"విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఏ విధంగా కాపాడుకోవాలో ఆలోచిస్తున్నాం.. కానీ ఒక పనికి మాలిన పార్టీ ఉంది.. ఆ పార్టీ నేతల పొట్ట నిండా అబద్ధాలే. వారికి కల వచ్చిందంటా...అమ్మడానికి నేను ఒప్పుకున్నానంట. తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు. "విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు" అని పోరాడి ఫ్యాక్టరీని సాధించుకున్నాం. నాడు ప్రైవేట్ పరం చేస్తామని ప్రతిపాదనలు వచ్చినప్పుడు నేను పోరాడి అడ్డుకున్నా. కేంద్రం నుండి ఆర్థిక సాయం కూడా తీసుకొచ్చాం. స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునే బాధ్యత మాదే. అబద్ధాలు చెప్పే వారి మాటలు ఖండిస్తూ వాస్తవాలు చెప్పాలి. కరుడుగట్టిన ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచేశారు..వీళ్లను వదలిపెట్టను. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పని చేస్తా." అని సీఎం చంద్రబాబు అన్నారు.

జగన్ అనే భూతాన్ని భూ స్థాపితం చేయాల్సింది ప్రజలే "సూపర్–6 హామీలు కూడా త్వరలో అమలు చేస్తాం.. ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం. 30 రోజులు కూడా కాలేదు.. అయినా చెప్పినమాట ప్రకారం పింఛన్ ను రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచాం. మూడు నెలల బకాయిలు కలిపి రూ.7 వేలు ఒకేసారి అందించాం. దేశంలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టం. మొదటి సంతకం డీఎస్సీపైనే పెట్టి 16,347 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపాం. మీ భూములు కొట్టేసేందుకు తెచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ను కూడా రద్దు చేశాం. 183 అన్న క్యాంటీన్లను ఆగస్టు 15 నుండి ప్రారంభించబోతున్నాం. పేదవాడికి అన్నం పెడితే సహించలేని మనస్తత్వం గత ప్రభుత్వానిది. పెట్టుబడిదారులతో మాట్లాడుతుంటే, మీ రాష్ట్రంలో భూతం ఉంది...అది లేస్తే ఏమవుతుందోనని అన్నారు. ఆ భూతానికి భూత వైద్యం చేసి శాశ్వతంగా భూ స్థాపితం చేసే బాధ్యత ప్రజలకే అప్పజెప్పామని వారితో చెప్పా. ఆ భూతాన్ని కంట్రోల్ చేసే వైద్యులు ప్రజలే." అని అన్నారు.

### కార్పెట్ కల్చర్ అధికారులు వీడాలి

"ప్రజల ఆదాయం పెంచే మార్గం చూస్తాం. స్కిల్ గణన చేసి యువతలో నైపుణ్యం పెంచేందుకు శ్రీకారం చుట్టబోతున్నాం. ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి అందిస్తున్నాం. నేను, పవన్ కళ్యాణ్, మోదీ చెప్పిన మాటలను ప్రజలు నమ్మి విశ్వసించారు. నెంబర్ వన్ రాష్ట్రంగా తయారు చేస్తాం. సచివాలయ సిబ్బందితో ఒకే రోజు పింఛన్లు అందించాం...కానీ నాటి ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ సాధ్యం కాదని చెప్పింది. పెంచిన పింఛన్లు ఇస్తూనే ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించాం. మాపై అభిమానం అనే పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. ప్రజలు కూడా నేతలకు సహకరించాలి. మీ శ్రేయస్సే మా అభిమతం. నవ్వినా కొట్టే వ్యక్తి మొన్నటిదాకా పాలించారు. మీరంతా సంతోషంగా ఉండాలి.. మీ సంతోషం కోసం మేము పని చేస్తాం. గత ముఖ్యమంత్రి ఎక్కడికైనా వస్తే చెట్లు నరికి, పరదాలు కట్టి, షాపులు మూయించేవారు. ఆడంబరాలు అవసరం లేదు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తే చాలు. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

# సైనాతో సరదాగా బ్యాడ్మింటన్ ఆడిన రాష్ట్రపతి

- క్రీడలపై తనకున్న ఆసక్తిని చాటుకున్న రాష్ట్రపతి ముర్ము
- సైనా నెహ్వాల్ తో స్నేహపూర్వక మ్యాచ్
- పాయింట్ సాధించగానే ప్రేక్షకుల హర్షధ్వానాలు
- వీడియో విడుదల చేసిన రాష్ట్రపతి కార్యాలయం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము క్రీడలపై తనకున్న ఆసక్తిని చాటుకున్నారు. ర్యాకెట్ పట్టి కాసేపు బ్యాడ్మింటన్ కోర్టులో సరదాగా మ్యాచ్ ఆడారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ సిల్వర్ మెడల్ విజేత సైనా నెహ్వాల్ తో రాష్ట్రపతి భవన్ లోని బ్యాడ్మింటన్ కోర్టులో స్నేహపూర్వక పోటీలో తలపడ్డారు. నిత్యం చీరలో కనిపించే ముర్ము ఈ మ్యాచ్ ఆడేందుకు సౌకర్యవంతంగా ఉండేలా సల్వార్ కమీజ్ ధరించారు. అలాగే కాళ్లకు షూ ధరించి కోర్టులో కలియదిరిగారు. ముందుగా సర్వ్ చేసిన ముర్ము.. ఆ తర్వాత ఒక పాయింట్ సాధించగానే ప్రేక్షకులంతా హర్షధ్వానాలు చేశారు. మరో రెండు పాయింట్లు సాధించినప్పుడు కూడా పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోను రాష్ట్రపతి భవన్ కార్యాలయం సోషల్ మీడియాలో పంచుకుంది. దేశంలోని చిన్నారులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకొనేందుకు క్రీడలను ఎంపిక చేసుకొనేలా వారిలో స్ఫూర్తినింపేందుకు రాష్ట్రపతి ఈ మ్యాచ్ ఆడినట్లు వివరించింది. రాష్ట్రపతి భవన్ లోని కల్చరల్ సెంటర్ లో శుక్రవారం హర్ స్టోరీ-మై స్టోరీ పేరిట లెక్చర్ సిరీస్ ప్రారంభం కానుంది. పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డుల గ్రహీత అయిన సైనా నెహ్వాల్ ఈ కార్యక్రమంలో తన అనుభవాలను పంచుకోనుంది. మహిళా పద్మ పురస్కార విజేతలు వారి విజయగాథలతో కోట్లాది మంది యువతలో స్ఫూర్తినింపే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

# పాక్‌కు వెళ్లేది లేదు..

## ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ వేదికలను మార్చండి : బీసీసీఐ



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో ఈ టోర్నీ జరగనుంది. ఇప్పటికే పాక్ క్రికెట్ బోర్డు ముసాయిదా షెడ్యూల్‌ను ఐసీసీకి సమర్పించగా ఈ షెడ్యూల్‌కు బీసీసీఐ ఆమోదం తెలపలేదని సమాచారం. గత ఆసియా కప్ జరిగినట్లే ఈ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాలనే ప్రతిపాదనలను ఐసీసీ ఎదుట బీసీసీఐ ఉంచినట్లు తెలిసింది. ఇప్పటికే పాకిస్థాన్‌కు తమ జట్టును పంపించేది లేదని.. భారత్ ఆడే మ్యాచ్‌ల వేదికలను మార్చాల్సిందేనని బీసీసీఐ పట్టుబట్టినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. టోర్నీకి సంబంధించి ముసాయిదా షెడ్యూల్‌ను సిద్ధం చేసిన పాక్.. భారత్ ఆడే మ్యాచ్‌లకు పాక్ లాహోర్ స్టేడియాన్ని కేటాయించింది. టీమ్ ఇండియా ఆడే మ్యాచ్‌లన్నీ అక్కడే జరుగుతాయని పేర్కొంది. అయితే, భద్రతాపరమైన సమస్యల నేపథ్యంలో అసలు పాక్‌కే వెళ్లకూడదనే బీసీసీఐ నిర్ణయించింది. దీంతో భారత్ ఆడే వేదికలను శ్రీలంక లేదా దుబాయ్‌కు మార్చాలనే కండీషన్‌ను పెట్టింది. ఎనిమిది జట్లతో కూడిన ఈ టోర్నీ వన్డే ఫార్మాట్‌లో జరగనుంది.

# లారా 400 పరుగుల రికార్డును బద్దలు కొట్టే భారత ఆటగాళ్ల ఎవరంటే..?



**విశ్వంభర, స్పోర్ట్స్ :** వెస్టిండీస్ దిగ్గజ ఆటగాడు బ్రియాన్ లారా తన కెరీర్‌లో ఎన్నో ఘనతలను సొంతం చేసుకున్నాడు. టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో ఓ ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరు చేసిన రికార్డు ఇందులో ఒకటి. 2004లో ఇంగ్లాండ్ పై 400 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. లారా ఈ రికార్డు సాధించి ఇప్పటి 20 సంత్సరాలు పూర్తి అయ్యాయి. ఇప్పటి వరకు ఈ రికార్డు అతడి పేరిటే ఉండడం విశేషం. ప్రస్తుతం టీ20ల హవా నడుస్తోంది. టెస్టులపై ఆటగాళ్లు ఆసక్తి చూపించడం లేదు. ఈ తరుణంలో టెస్టుల్లో లారా రికార్డు బద్దలు కొట్టడం దాదాపుగా అసాధ్యమనేది క్రికెట్ పండితులు అభిప్రాయం. కాగా.. దీనిపై లారా స్పందించాడు. తన రికార్డును బద్దలు కొట్టే అవకాశం ఆధునిక క్రికెటర్లలో ఓ నలుగురికి ఉందని అతడు అభిప్రాయపడ్డాడు. ఇందులో ఇద్దరు భారత్‌కు చెందిన వారు కాగా మరో ఇద్దరు ఇంగ్లాండ్‌కు చెందిన ఆటగాళ్లు ఉండడం విశేషం. తాను క్రికెట్ ఆడే రోజుల్లో వీరేంద్ర సెహ్వాగ్, క్రిస్ గేల్, ఇంజమామ్ ఉల్ హక్, సనత్ జయసూర్య వంటి ఆటగాళ్లు చాలా వేగంగా ఆడేవారని అన్నాడు. వారు తన రికార్డును బద్దలు కొట్టే అవకాశం ఉందని భావించినట్లు చెప్పుకొచ్చాడు. అయితే అది జరగలేదన్నాడు. కాగా.. టెస్టుల్లో వీరంతా 300 పై చిలుకు స్కోరు సాధించారు. ఇందులో టీమ్ఇండియా విధ్వంసకర ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ రెండు సార్లు ట్రిపుల్ సెంచరీలు చేయడం గమనార్హం. రికార్డులు అన్నాక బద్దలు అవుతుంటాయని లారా చెప్పాడు. 10 ఏళ్ల క్రితం సచిన్ 49 వన్డే సెంచరీల రికార్డు బద్దలు కొట్టే అవకాశం లేదని అంతా భావించారు. అయితే.. విరాట్ కోహ్లి దీన్ని సాధించాడు. అలాగే లారా 400 పరుగుల రికార్డు, సచిన్ 100 సెంచరీల రికార్డును సైతం ఎవరో ఒకరు ఖచ్చితంగా బ్రేక్ చేస్తారు. ప్రస్తుతానికి ఇది అసంభవం లాగానే కనిపిస్తుంది కానీ ఏదో ఒకరోజు రికార్డులు బద్దలు కావడం ఖాయం అని లారా అన్నాడు. ప్రస్తుతం జట్లు అన్ని కూడా డ్రా కంటే విజయాల కోసం ఎక్కువగా ఆడుతున్నాయి. కాబట్టి ఓ బ్యాటర్ 400 పరుగులు చేసే అవకాశం చాలా తక్కువగా ఉంది. అయితే.. క్రికెట్ అంటేనే ఊహలకు అందనిది కాబట్టి.. ఎవ్వరు అయినా సరే దాన్ని సాధించొచ్చు. ఆధునిక ఆటగాళ్లలలో తన రికార్డును టీమ్ఇండియా యువ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ అదే విధంగా బజ్‌బాల్ క్రికెట్ ఆడుతున్న ఇంగ్లాండ్ జట్టులో జాక్ క్రాలే, హ్యారీ బ్రూక్ బ్రేక్ చేసే అవకాశం ఉన్నట్టుగా చెప్పారు.

### భారత క్రికెటర్ల విషయానికి వస్తే..

లారా రికార్డును యశస్వి జైసాల్ అందుకునే అవకాశాలు ఉన్నాయి. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఈ లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ 700కి పైగా పరుగులు చేశాడు. లాంగ్ ఇన్నింగ్స్ ఆడగల సామర్థ్యం అతడి సొంతం. ఇప్పటికే రెండు డబుల్ సెంచరీలు చేశాడు. తన అరంగ్రేట టెస్టు మ్యాచ్‌లోనే 171 పరుగులు చేశాడు. ఇక అతడు మూడు టెస్టు సెంచరీలు చేయగా ఆ మూడు కూడా 150 ప్లస్ పరుగులు చేయడం గమనార్హం.



# 150 టీ20లు గెలిచిన ఒకే ఒక్క జట్టుగా భారత్ సరికొత్త రికార్డు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** జింబాబ్వేతో నిన్న జరిగిన మూడో టీ20లో విజయం సాధించిన భారత జట్టు 2-1తో సిరీస్‌లో ముందంజ వేసింది. ఈ విజయంతో ఓ ఘనమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ టీ20ల్లో ఏకంగా 150 మ్యాచ్‌లు గెలిచిన ఏకైక జట్టుగా అవతరించింది. భారత్ తర్వాత పాకిస్థాన్ 142 విజయాలతో రెండోస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ (111), ఆస్ట్రేలియా (105), సౌతాఫ్రికా (104) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో నిన్న జరిగిన మూడో టీ20లో భారత జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ శుభమన్‌గిల్ 66 పరుగులతో అదరగొట్టగా, గత మ్యాచ్ సెంచరీ హీరో అభిషేక్ శర్మ 10 పరుగులు మాత్రమే చేశాడు. జైస్వాల్ 36, గైక్వాడ్ 49 పరుగులు చేయడంతో భారత జట్టు 182 పరుగులు చేసింది. అనంతరం 183 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన జింబాబ్వే 159 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చివరి రెండు మ్యాచ్‌లో ఈ నెల 13, 14న జరగనున్నాయి.

# హెడ్ కోచ్‌గా గంభీర్..

## సైలెంట్‌గా కోహ్లిని పక్కనబెడుతున్న బీసీసీఐ..?



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్ఇండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్‌ను బీసీసీఐ నియమించింది. రాహుల్ ద్రవిడ్ వారసుడిగా గంభీర్ శ్రీలంక పర్యటనతో తన బాధ్యతలను చేపట్టనున్నాడు. సహాయక ఆటగాళ్ల ఎంపిక విషయంలో గంభీర్ కు బీసీసీఐ పూర్తి స్వేచ్ఛని ఇచ్చినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉంటే.. గంభీర్‌ను కోచ్‌గా ఎంపిక చేసే సమయంలో టీమ్ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి అభిప్రాయాన్ని బీసీసీఐ తీసుకోలేదట. కనీసం అతడికి సమాచారాన్ని కూడా అందించలేదట. హెడ్ కోచ్‌గా గంభీర్ ఎంపిక కావడంతో ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో ఓ చర్చ పెద్ద ఎత్తున నడుస్తోంది. కోహ్లితో హెడ్ కోచ్‌గా గంభీర్ ఎలా వ్యవహరిస్తాడు అన్నదే. వాస్తవానికి గంభీర్-కోహ్లి మధ్య విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. ఐపీఎల్ సమయంలో పలుమార్లు వీరిద్దరు వాగ్వాదానికి దిగిన ఘటనలు చూశాం. అయితే.. ఐపీఎల్ 2024 సీజన్ సమయంలో ఇద్దరూ ఒకరినొకరు హగ్ చేసుకుని తమ పాత గొడవలకు ఫుల్ స్టాప్ పెట్టారు. కాగా.. అదంతా కెమెరాల కోసమేనని కొందరు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కోచ్‌ను ఎంపిక చేసే సమయంలో జట్టులోని సీనియర్ ఆటగాళ్ల అభిప్రాయాలను ఆయా దేశాల క్రికెట్ బోర్డులు తీసుకుంటుంటాయి. అలాగే కోహ్లి అభిప్రాయాన్ని తీసుకుంటారని అంతా అనుకున్నారు. అయితే.. కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అభిప్రాయాలను మాత్రమే బీసీసీఐ తీసుకున్నట్లుగా జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీమ్ఇండియా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కోహ్లిని విస్మరించినట్లుగా సదరు కథానాలు పేర్కొన్నాయి. ఇప్పటికే టీ20 ఫార్మాట్‌కు రోహిత్, కోహ్లిలు గుడ్ బై చెప్పేశారు. పొట్టి ఫార్మాట్‌కు హార్దిక్ పాండ్యా కెప్టెన్ కానుండడం లాంఛనమే. వచ్చే ఏడాది జరిగే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ తరువాత కోహ్లి వన్డేలు ఆడతాడో లేదోనన్న వాదన వినిపిస్తోంది. టెస్టుల్లో మాత్రం మరికొన్నాళ్ల పాటు కొనసాగే అవకాశం ఉంది. అటు గంభీర్ పర్యవేక్షణలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025, డబ్ల్యూటీసీ 2025 ఫైనల్, టీ20 ప్రపంచకప్ 2026, వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీలను ఆడనుంది. ఈ క్రమంలో బీసీసీఐ కూడా భవిష్యత్ టోర్నీల నేపథ్యంలో కోహ్లికి అంతగా ప్రాముఖ్యత ఇవ్వడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అందుకనే గంభీర్‌ను కోచ్‌గా నియమిస్తున్న విషయాన్ని మాటమాత్రానికైనా కోహ్లికి చెప్పలేదని అంటున్నారు. ఈ విషయమై ఓ జాతీయ మీడియాతో బీసీసీఐ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. 'వాళ్లిద్దరూ విభేదాలను పక్కనబెట్టి చర్చించుకునేందుకు చాలా సమయముంది. అయితే.. బీసీసీఐ మాత్రం దీర్ఘకాలిక ప్రణాళికలో ఉంది. సీనియర్లు కెరీర్ చరమాంకంలో ఉన్న వేళ కొత్త కుర్రాళ్లు ఆ స్థానాలను భర్తీ చేసే దిశగా అడుగులు వేయాలి.' అని అన్నాడు.

# స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఈ ఉదయం మార్కెట్లు లాభాల్లోనే ప్రారంభమయ్యాయి. అయితే, ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు ఊపందుకోవడంతో నష్టాలు తగ్గుతూ వచ్చాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 27 పాయింట్లు నష్టపోయి 79,897కి పడిపోయింది. నిఫ్టీ 8 పాయింట్లు కోల్పోయి 24,315 వద్ద స్థిరపడింది.

### బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:

ఐటీసీ (1.64%), టాటా మోటార్స్ (1.52%), ఏసియన్ పెయింట్స్ (0.93%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.88%), టైటాన్ (0.84%).

### టాప్ లూజర్స్:

బజాజ్ ఫైనాన్స్ (-1.48%), మహీంద్రా అండ్ మహీంద్రా (-1.24%), ఎన్టీపీసీ (-1.14%), నెస్లే ఇండియా (-1.05%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-0.95%).

# కొత్త ప్లాన్ ప్రకటించిన బీఎస్ఎన్ఎల్

**విశ్వంభర, బిజినెస్ :** ప్రభుత్వరంగ టెలికం ఆపరేటర్ బీఎస్ఎన్ఎల్ త్వరలోనే దేశవ్యాప్తంగా 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురాబోతోంది. ఈ మేరకు నెట్‌వర్క్ అప్‌గ్రేడ్‌కు సంబంధించిన పనులను కంపెనీ చక్కబెడుతోంది. అయితే 4జీ సేవల ప్రారంభానికి ముందే అదిరిపోయే ఆఫర్‌ను బీఎస్ఎన్ఎల్ ప్రకటించింది. 13 నెలల వ్యాలిడిటీతో (395 రోజులు) తీసుకొచ్చిన ఈ ప్లాన్ ధర రూ.2,399గా ఉంది. నెలకు రూ.200 కంటే తక్కువే పడుతున్న ఈ ఆఫర్‌లో రోజుకు 2జీబీ హై-స్పీడ్ డేటా లభిస్తుంది. ఇక రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు, దేశవ్యాప్తంగా ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాలింగ్, ఉచిత రోమింగ్, ఇంకా అనేక విలువ ఆధారిత సేవలను యూజర్లు పొందవచ్చు. జింగ్ మ్యూజిక్, బీఎస్ఎన్ఎల్ ట్యూన్స్, హార్డీ గేమ్స్, ఛాలెంజర్ అరేనా గేమ్స్, గేమన్ ఆస్ట్రోటెల్ వంటి సర్వీసులు ఉన్నాయి.

### 365 రోజుల ప్లాన్ ప్రయోజనాలు ఇవే..

ఒక ఏడాది ప్లాన్లలో భాగంగా 365 రోజుల ప్లాన్‌ను కూడా బీఎస్ఎన్ఎల్ అందిస్తోంది. ఈ ప్లాన్‌లో రోజువారీ పరిమితి లేకుండా మొత్తం 600జీబీల డేటాను కంపెనీ అందిస్తోంది. ప్రతిరోజూ 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు, దేశవ్యాప్తంగా ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాలింగ్ చేసుకోవచ్చు.

### బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్న కస్టమర్లు..

ఇటీవల అన్ని టెలికం కంపెనీలు టారిఫ్ ప్లాన్లను భారీ పెంచాయి. దీంతో ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన పలు పోస్టులు సోషల్ మీడియాలో కనపడుతున్నాయి. దీంతో రేట్లు పెరిగిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్లాన్ల వైపు కస్టమర్లు చూస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కస్టమర్లను ఆకర్షించుకోవడమే లక్ష్యంగా మెరుగైన సేవలతో ఆకర్షణీయమైన ఆఫర్లు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సమాయత్తమవడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.




# ఒక్క రూపాయి ఆదాయపు పన్ను వివాదం..

### సీఏకు రూ. 50 వేల చెల్లింపు!



**విశ్వంభర, బిజినెస్ :** ఆదాయపన్ను శాఖతో రూపాయి విలువైన వివాదం పరిష్కారానికి ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి చార్టెడ్ అకౌంటెంట్‌కు ఏకంగా రూ. 50 వేలు సమర్పించుకున్నాడు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా ఎక్స్ ద్వారా వెల్లడించాడు. తాను జోక్ చేయడం లేదని చెప్పుకొచ్చాడు. అపూర్వ్ జైన్‌కు ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం నుంచి ఇటీవల ఓ నోటీసు వచ్చింది. అయితే, అది ఎందుకొచ్చిందో తెలుసుకునేందుకు దానిని పట్టుకుని చార్టెడ్ అకౌంటెంట్ వద్దకు వెళ్లాడు. ఆ నోటీసు సంగతేంటో తెలుసుకునేందుకు ఆ సీఏ ఏకంగా రూ. 50 వేలు ఫీజుగా తీసుకున్నాడు. చివరికి తేలిందేంటంటే ఆ వివాదం కేవలం ఒక్క రూపాయికి సంబంధించినదని! అసలు విషయం తెలిశాక అపూర్వ్ నోరెళ్లబెట్టాడు. రూపాయి కోసం రూ. 50 వేలు పోగొట్టుకున్నట్టు తెలిసి నెత్తీనోరు బాదుకున్నాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పెట్టి తన ఆవేదన వెళ్లగక్కాడు. ఇది చూసిన నెటిజన్లు రెండుగా విడిపోయి చర్చకు తెరదీశారు. కొందరు ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, మరికొందరు జైన్‌ను తప్పుబడుతున్నారు. వివాదంలో ఉన్న మొత్తం గురించి అతడు ముందే ఎందుకు చెప్పలేదని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చిన్న మొత్తాల విషయంలో సీఏ జోక్యం లేకుండానే పరిష్కరించుకోవచ్చని చెబుతున్నారు. చాలామంది ట్యాక్స్ టెర్రరిజం బారిన పడుతున్నారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

# ముంచుకొస్తున్న గడువు..

## ఆ వెబ్‌సైట్స్ సాయంతో ఈజీగా ఐటీ రిటర్న్స్ దాఖలు

**విశ్వంభర, బిజినెస్ :** 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్‌లను ఫైల్ చేయడానికి గడువు జూలై 31 అనే విషయం అందరికీ తెలిసిందే. పన్ను చెల్లింపుదారులందరూ ఈ తేదీలోపు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ మోడ్‌లో తమ రిటర్న్‌లను ఫైల్ చేయాలి. ఈ-ఫైలింగ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ రిటర్న్‌లను ఫైల్ చేసే విధానంలో ఇటీవల కాలంలో ఎక్కువ తమ ఐటీ రిటర్న్స్‌ను ఫైల్ చేస్తున్నారు. అయితే ఆదాయపు పన్ను లెక్కింపు అనేది సగటు పన్ను చెల్లింపుదారుడికి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులకు ఐటీ రిటర్న్స్ విషయంలో సాయం చేసేలా రూపొందించిన వెబ్‌సైట్స్ ఇటీవల కాలంలో బాగా ప్రాచుర్యం పొందాయి. ఆయా వెబ్‌సైట్స్ ద్వారా ముందుగా నింపిన ఫారమ్‌లు, ఈ-ధ్రువీకరణ ఎంపికలు, రీఫండ్ స్టేటస్ ట్రాకింగ్, వివిధ రకాల పన్ను చెల్లింపుదారులకు అనుగుణంగా సమగ్ర మద్దతును అందిస్తాయి. ఈ నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులకు ఉపయోగపడే వెబ్‌సైట్స్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

### ఐటీ ఈ-ఫైలింగ్ పోర్టల్

భారత ప్రభుత్వం ద్వారా నిర్వహించే ఆదాయపు పన్ను శాఖకు సంబంధించిన అధికారిక ఈ-ఫైలింగ్ పోర్టల్ యూజర్ ఫ్రెండ్లీగా, సురక్షితంగా ఉండేలా రూపొందించారు. ఈ సైట్ ద్వారా మీరు చాలా ఈజీగా ఐటీ రిటర్న్స్ ను ఫైల్ చేయవచ్చు. ఈ పోర్టల్ వివిధ పన్ను చెల్లిం పుదారుల వర్గాలకు అనుకూలమైన ఫీచర్‌లతో పాటు ముందుగా నింపిన ఫారమ్‌లు, ఈ-ధ్రువీకరణ ఎంపికలు, మీ ఫైలింగ్ స్టేటస్‌పై లైవ్ అప్‌డేట్‌లను అందిస్తుంది. ఫైలింగ్ ప్రక్రియలో సహాయం చేయడానికి ఎఫ్ఏక్యూలు, వీడియోలు ఈ సైట్‌లో ఉంటాయి

### ట్యాక్స్ టు విన్

ట్యాక్స్ టు విన్ సైట్ ఆదాయపు పన్ను రిటర్న్‌లను ఫైల్ చేయడానికి రెండు ఎంపికలను అందిస్తుంది. ఒక దూ-ఇట్-యువర్ సెల్ఫ్ కాగా నిపుణుల ద్వారా సాయం పొందే అవకాశం ఉంటుంది. విభిన్న ప్రొఫైల్‌ల పన్ను చెల్లింపుదారులకు వినియోగదారు-స్నేహపూర్వక అనుభవాన్ని, సమగ్ర మద్దతును అందించడానికి ప్లాట్‌ఫారమ్ రూపొందించారు. ఇది సమర్థవంతమైన, అవాంతరాలు లేని ఫైలింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి డాక్యుమెంట్ అప్‌లోడ్, రీఫండ్ ట్రాకింగ్ మరియు రౌండ్-ది-క్లాక్ కస్టమర్ సపోర్ట్ వంటి ఫీచర్‌లను కలిగి ఉంటుంది.




# వరుణ్ సందేశ్ 'విరాజి' టీజర్ రిలీజ్..




వరుణ్ సందేశ్ ఇటీవలే నింద సినిమాతో గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చి ఇప్పుడు మరో సినిమాతో రాబోతున్నాడు. మహా మూవీస్ తో కలిసి ఎం3 మీడియా బ్యానర్ పై మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మాణంలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో వం-రుణ్ సందేశ్ హీరోగా విరాజి సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమాలో రఘు కారుమంచి, ప్రమోదిని, బలగం జయరామ్, వైవా రాఘవ, ఫణి ఆచార్య, అపర్ణాదేవి, ప్రసాద్ బెహరా.. పలువురు నటించారు. విరాజి సినిమా ఆల్రెడీ షూటింగ్ పూర్తిచేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమాని ఆగస్టు 2న రిలీజ్ చేయబోతున్నట్టు ఆల్రెడీ ప్రకటించారు. మరో పక్క ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టారు మూవీ యూనిట్. తాజాగా విరాజి టీజర్ రిలీజ్ చేశారు. బేబీ మూవీ డైరెక్టర్ సాయి రాజేష్ చేతుల మీదుగా విరాజి టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే ఇదేదో హారర్ థ్రిల్లర్ సినిమాలా అనిపిస్తుంది. ఈ సినిమాలో వరుణ్ సందేశ్ కొత్త లుక్ లో కనిపించబోతున్నాడు.

# సమంతని ఇండస్ట్రీకి పరిచయం చేసిన డైరెక్టర్‌తో మళ్ళీ సినిమా



తెలుగులో అయితే సమంతకి ఎవరూ సినిమాలు ఆఫర్ చేసినట్టు టాక్ కూడా వినిపించట్లేదు. బాలీవుడ్ లో మాత్రం సమంతకి ఆఫర్స్ వస్తున్నాయని తెలుస్తుంది. పుష్పలో ఐటెం సాంగ్ చేసిన సమంత పుష్ప 2లో కూడా ఉంటుంది అనుకున్నారు కానీ అందులో కూడా ఉండదని తెలుస్తుంది. సమంతకి సినిమా, సిరీస్ ఆఫర్లు వచ్చినా సెలెక్టివ్ గా వెళ్తుందని టాక్. తాజాగా సమంతా ఓ మలయాళం సినిమాకు ఓకే చెప్పినట్టు సమాచారం. సమంతని సినీ పరిశ్రమకు పరిచయం చేసిన దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్. సమంత, నాగచైతన్య జంటగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో వచ్చినా ఏ మాయ చేసావే సినిమాతోనే సమంత సినీ పరిశ్రమకు పరిచయమైంది. ఆ తర్వాత మళ్ళీ గౌతమ్ మీనన్ దర్శకత్వంలో సమంత ఎటో వెళ్ళిపోయింది మనసు సినిమాలో తెలుగు, తమిళ్ వర్షన్ లో నటించింది. ఇప్పుడు మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత గౌతమ్ మీనన్ దర్శకత్వంలో సమంత నటించబోతుందని సమాచారం. గౌతమ్ మీనన్ కెరీర్ లో మొదటిసారిగా దర్శకుడిగా ఓ మలయాళ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో మమ్ముట్టి హీరోగా నటిస్తుండగా సమంత ఓ కీలక పాత్రలో నటిస్తుందట. సమంతకి కెరీర్లో ఫస్ట్ ఛాన్స్ ఇచ్చిన దర్శకుడు గౌతమ్ మీనన్ ఇప్పుడు ఈ మలయాళ సినిమాతో సమంతకి మళ్ళీ సెకండ్ ఇన్నింగ్స్ బ్రేక్ ఇస్తాడా చూడాలి.

## బికినీ వేసుకోలేదని హీరోయిన్‌పై ఫొటోగ్రాఫర్ సీరియస్



మనీషా కోయిరాలా..! ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న మనీషా.. వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. ప్రాణాంతకమైన క్యాన్సర్ సమస్యతో పోరాడి గెలిచింది. చాలా కాలంపాటు సినిమాలకు దూరంగా ఉన్న ఆమె ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చింది. ఇటీవల డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన హిరామండి వెబ్ సిరీస్ ద్వారా ఓటీటీ ప్రియులను అలరించింది. ఇక ఈక్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూకు వెళ్లిన ఈమె తన కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన చేదు ఓ అనుభవాన్ని గుర్తు చేసుకుని బాధపడింది. తన మాటలతో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇంతకీ మనీషా ఆ ఇంటర్వ్యూలో ఏం చెప్పారంటే..! "కెరీర్ ప్రారంభంలో ఫోటోషూట్స్ చేస్తామని కొందరు అడిగేవారు. ఆ సమయంలో ఓ ఫోటోగ్రాఫర్ నాపై తెగ ప్రశంసలు కురిపించాడు. నేను కచ్చితంగా సూపర్ స్టార్ అవుతానని అన్నాడు. ఆ తర్వాత టూ పీస్ బికినీ వేసుకుంటావని ఆ ఫోటోగ్రాఫర్ అడిగితే.. సినిమాల్లో అవకాశాల కోసం నేను ఇలాంటి డ్రెస్ వేసుకోను అని నిర్మొహటంగా చెప్పేశాను. దీంతో ఆయన నన్ను గట్టిగా తిట్టాడు. కరగడానికి నిరాకరించే మట్టిముద్ద నుంచి ఎవరూ బొమ్మను తయారు చేయలేరు అని వెళ్లిపోయాడు. అతడి మాటలను నేనెప్పటికీ మర్చిపోలేను. అందరి మనస్తత్వం ఒకేలా ఉండదని అప్పుడే అర్థం చేసుకున్నాను. ఆ తర్వాత నా సినిమాలు హిట్ అయ్యాక.. నేను పెద్ద సెలబ్రెటీ అయ్యాక అతడే వచ్చి నా ఫోటోషూట్ చేశాడు" అంటూ గుర్తుచేసుకుంది మనీషా.!

## రిలీజ్‌కు ముందే ఆ సినిమాకు అవార్డుల పంట

ఇటీవల సోలో క్యారెక్టర్ తో సినిమాలు బాగానే వస్తున్నాయి. త్వరలో సోలో క్యారెక్టర్ తో హలో బేబీ అనే ఒక సినిమా రాబోతుంది. కాండ్రేగుల ఆదినారాయణ నిర్మాణంలో రామ్ గోపాల్ రత్నం దర్శకత్వంలో కావ్య కీర్తి సోలో క్యారెక్టర్ గా హలో బేబీ అనే సినిమా తెరకెక్కింది. ఒక్క క్యారెక్టర్ తో హ్యాకింగ్ కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. గతంలో ఆల్రెడీ ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్, సాంగ్స్ విడుదల చేశారు. ఆల్రెడీ విడుదల సిద్ధంగా ఉన్న ఈ హలో బేబీ సినిమాని పలు అవార్డు వేడుకలకు పంపిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ లో జరిగిన పురస్కార్ నంది అవార్డ్స్ వేడుకల్లో హలో బేబీ సినిమాలో నటించిన కావ్య కీర్తి నటనకు గాను పురస్కార్ నంది అవార్డు దక్కింది. ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ రాజేంద్ర, మహర్షి రాఘవ.. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా కీర్తి కావ్య ఈ అవార్డు అందుకుంది.



## ఎముకల ఆరోగ్యానికి
# ఏడు ఆహారాలను తినండి

**విశ్వంభర, ఫీచర్ :** ఎముకలు దృఢంగా ఉండాలంటే సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ఎముకలు ఆరో గ్యంగా ఉండాలంటే కాల్షియం మాత్రమే కాదు, విటమిన్ డి, విటమిన్ కె, విటమిన్ ఎ, ప్రొటీన్, జింక్ వంటి పోష కాలు అధికంగా ఉండే ఆహారాలు ఎముకల పెరుగుదలకు చాలా ముఖ్యమైనవి. 25 ఏళ్లు దాటినప్పటి నుంచి ఎము కల ఆరోగ్యం మెల్లిమెల్లిగా తగ్గుతుంది. అందుకే అప్పుడు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా మహిళలు ఈ విషయంల జాగ్రత్తగా ఉండాలి.



### తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే..!

**బాదం**

బాదంపప్పులో క్యాల్షియం, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల పెరుగుదలకు, గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. బాదంపప్పును నాన బెట్టి లేదా పాలలో మెత్తగా తినవచ్చు. ఎముకల నిర్మాణంలో మరియు రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో విటమిన్ కె ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. బాదం పప్పు వంటి విటమిన్ కె అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఎముకలు దృఢంగా మారడంతోపాటు పగుళ్లను నివారించవచ్చు.

**గుడ్డు**

గుడ్లలో విటమిన్ డి మంచి మొత్తంలో ఉన్నందున ఎముకలను బలోపేతం చేస్తుంది. గుడ్డులో విటమిన్ డి ఉండటం వల్ల ఎముకలు బలపడతాయి. కాల్షియం శోషణకు సరైన ఎముక ఆరోగ్యాన్ని నిర్వహించడానికి విటమిన్ డి అవసరం.

**మొరింగ ఆకులు**

మొరింగ ఆకులలో కాల్షియం మరియు ఐరన్ ఉంటాయి. ఈ రెండు ఖనిజాలు ఎముకల నాణ్యతను పెంచుతాయి. నిజానికి, ఇది బోలు ఎముకల వ్యాధి మరియు ఆస్టియో ఆర్థరైటిస్‌ను కూడా నిరోధించడంలో సహాయపడుతుంది.

**జీలకర్ర**

ఇది ఎముకల సాంద్రతను పెంచడంలో మరియు బోలు ఎముకల వ్యాధిని నివారించడంలో సహాయపడే కాల్షియం యొక్క మంచి మూలం కాబట్టి ఇది ఎముకల ఆరోగ్యానికి మంచిది.

**రాగి**

రాగుల్లో పొటాషియం, ఫాస్ఫరస్, కాల్షియం మరియు ఐరన్ పుష్కలంగా ఉన్నాయి, ఇవి ఎముకల సాంద్రత మరియు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ముఖ్యమైన అంశాలు. ఇది బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**బీన్స్, పప్పులు**

బీన్స్, కాయధాన్యాలలో ఫైబర్, ప్రోటీన్, ఇతర ఖనిజాలు అధికంగా ఉంటాయి. సోయాబీన్స్, గ్రీన్ బీన్స్, ఎర్ర మిల్లెట్ మరియు బఠానీలతో సహా బీన్స్ మరియు కాయధాన్యాలలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది.



## ఫ్రిడ్జులో పెట్టిన చపాతీ పిండి నల్లగా అవుతుందా..?


**విశ్వంభర, ఫీచర్ :** చపాతీ పిండితో ఎప్పుడు ఏదో ఒక పంచాయితీ ఉంటుంది. ఒక్కోసారి మెత్తగా ఉండదు, ఒక్కోసారి ఎంత కొలతలు వేసుకుని కలిపినా మిగిలిపోతుంది. మిగిలింది ఫ్రిడ్జ్‌లో పెడితే అది నల్లగా అవుతుంది. మీరు ఇలాంటి సమస్యను ఎదుర్కొనే ఉంటారు కదా..! ఫ్రిడ్జ్‌లో పెట్టిన చపాతీ పిండి నల్లగా అవకూడదంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. చపాతీ పిండిని కలుపుతున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు, పిండి త్వరగా పాడవదు. అంటే పిండిని పిసుకుతూ నీళ్లలో కొన్ని ఐస్ క్యూబ్స్ వేసి కరిగిన తర్వాత మెత్తగా కలపాలి. ఇలా చేయడం వల్ల పిండి త్వరగా పాడవదు. నల్లగా కూడా మారదు. చపాతీ కాల్చుకుంటే మెత్తగా ఉంటుంది. మిగిలిన పిండిని గాలి చొరబడని డబ్బాలో ఉంచండి.

### పిండి మెత్తగా ఉండాలంటే ఏం చేయాలి?

చాలాసార్లు ఫ్రిజ్‌లో ఉంచిన చపాతీ పిండితో చపాతీలు చేసినప్పుడు అవి మెత్తగా ఉండవు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఒక మార్గం ఉంది. ఫ్రిడ్జ్‌లో ఉంచిన చపాతీ పిండిని తీసిన తర్వాత అందులో పైన రెండు లేదా మూడు చెంచాల నీళ్లు పోసి మూతపెట్టి 10 నిముషాల తర్వాత ముద్దలా చేస్తే చపాతీ మెత్త గా ఉంటుంది.

**పిండిని ఎక్కువ సేపు నిల్వ ఉంచుకోవడం ఎలా:** చపాతీ పిండిని ఫ్రిజ్‌లో ఉంచేటప్పుడు కొద్దిగా నూనె పోయాలి. ఆ తర్వాత, గాలి చొరబడని కంటైనర్‌లో సీల్ చేసి ఫ్రిజ్‌లో ఉంచండి. ఇలా చేస్తే చపాతీ పిండి ఎక్కువ సేపు ఉంటుంది. త్వరగా పాడవదు. అసలు చపాతీ పిండిని ఫ్రిడ్జ్‌లో పెట్టకుండా ఉంచేదే మేలు.. ఎందుకంటే.. ఫ్రిడ్జులో పెట్టిన చపాతీ పండితో చపాతీలు చేసుకుని తరచూ తింటే.. ఆరోగ్యం పాడవుతుంది. ఎప్పుడో ఒకసారి అయితే ఇలాంటి జాగ్రత్తలు తీసుకోని పెడితే చాలు. ముందు రోజు చేసిన చపాతీలను ఉదయం తినడం ఆరోగ్యానికి మంచిదే. మీకు కొంచెం పిండి మిగిలితే వాటితో కూడా చపాతీలు చేసి పక్కన పెట్టుకోండి. ఫ్రిడ్జులో పెట్టాల్సిన అవసరం లేదు. ఉదయం లేచిన తర్వాత టిఫెన్‌లా ఆ చపాతీలనే తింటే సరిపోతుంది.

## ఈ డ్రైఫ్రూట్స్ రోజూ తినకూడదు..?
### లాభం కంటే నష్టమే ఎక్కువ



**విశ్వంభర, ఫీచర్ :** చలికాలంలో డ్రై ఫ్రూట్స్ ఎక్కువగా తింటారు. అయితే ఎండాకాలం వచ్చిందంటే తినడం మానేస్తారు. ఎండాకాలంలో డ్రై ఫ్రూట్స్ తింటే శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని భావించేవారు చాలా మంది ఉన్నారు. కానీ నిపుణులు భిన్నమైన అభిప్రాయం కలిగి ఉన్నారు. ఎండాకాలంలో కూడా డ్రై ఫ్రూట్స్ వేడిగా ఉన్నప్పటికీ తినవచ్చని అంటున్నారు. రోజూ డ్రైఫ్రూట్స్ తినడం వల్ల శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. ఇందులో ఫైబర్, విటమిన్లు, మినరల్స్ మరియు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి మీ శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. అయితే కొన్ని డ్రైఫ్రూట్స్‌ను రోజూ తినకూడదట. అవేంటంటే..

**ఏ డ్రై ఫ్రూట్స్ రోజూ తినకూడదు**

జీడిపప్పులో కేలరీలు మరియు కొవ్వు చాలా ఎక్కువగా ఉంటాయి, వీటిని రోజూ తినడం వల్ల బరువు పెరుగుతారు. అదేవిధంగా, బ్రెజిల్ నట్స్‌లో సెలీనియం చాలా ఎక్కువగా ఉంటుంది. సెలీనియం శరీరానికి మేలు చేసినప్పటికీ, ప్రతిరోజూ దీనిని తీసుకోవడం వల్ల మీ శరీరంలో సెలీనియం విషపూరితం కావచ్చు.

**ఈ డ్రై ఫ్రూట్స్‌ను రోజూ తినకండి**

ఇది కాకుండా, హాజెల్ నట్స్ మరియు పైన్ నట్స్ కూడా అధిక కేలరీలు మరియు కొవ్వును కలిగి ఉంటాయి, దీని వలన మీరు బరువు పెరుగుతారు. వీటిని రోజూ తీసుకోవడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు కూడా ఎక్కువ. అత్తిపండ్లు మరియు పిస్తాపప్పులు మీ శరీరానికి శక్తినిచ్చే చాలా మంచి డ్రై ఫ్రూట్స్, అయితే వేసవిలో ఈ డ్రై ఫ్రూట్స్‌ని రెగ్యులర్ గా తీసుకోవడం మానేయాలి మరియు పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. అదే సమయంలో, ఏదైనా డ్రై ఫ్రూట్స్ తినడానికి ముందు, వాటికి అలెర్జీ లేదని నిర్ధారించుకోండి. మీరు తీసుకొనే ఆహారంలో డ్రైఫ్రూట్స్ తప్పకుండా ఉండాలి. ముఖ్యంగా బాదం పప్పులను రోజూ క్రమం తప్పకుండా తినడం వల్ల బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు మీ సొంతమవుతాయి. ఎందుకంటే బాదంలో ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com